





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 | సంచిక : 10 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 29 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda




హైవే 44పై కొట్టుకుపోయిన రోడ్డు





# కామారెడ్డిపై క్లౌడ్ బరస్ట్

భారీ వర్షాలు, వరదలు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఏరియల్ సర్వే

- వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు విహంగ వీక్షణం
- ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన ముఖ్యమంత్రి
- వరద ప్రవాహాన్ని పరిశీలించిన రేవంత్ రెడ్డి

- కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలతో వరద ఉధృతి
- నీట మునిగిన పలు గ్రామాలు.. ఇళ్లు ఖాళీ చేస్తున్న ప్రజలు
- నిజాంసాగర్, కౌలాస్ నాలా గేట్లు ఎత్తడంతో మంజీరాకు పోటెత్తిన వరద
- వందలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- గుళ్లు, బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్న బాధితులు

హైదరాబాద్ పెన్ పవర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణలోని కామారెడ్డి జిల్లా విలవిల్లాడుతోంది. జిల్లాలోని ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.







వివరాలు 2లో..

# ఈ సమయంలో ఒలింపిక్స్ క్రీడల గురించి సమీక్ష చేస్తారా?

## రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్టు సీఎం తీరు
- భారీ వర్షాలతో కామారెడ్డి పట్టణానికి పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు
- ప్రజలు కష్టాల్లో ఉంటే ఒలింపిక్స్, మూసీ సుందరీకరణపై సమావేశాలా అని ప్రశ్న
- మరో నాలుగు రోజులు వర్ష సూచన ఉన్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపణ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలు భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రోమ్ నగరం అగ్నికి ఆహుతవుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా ముఖ్య మంత్రి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి పట్టణానికి రోడ్డు మార్గాలన్నీ మూసుకుపోయి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇటు వంటి కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకో వాల్సింది పోయి, ఇతర అంశాలపై దృష్టి పెట్టడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వా తావరణ శాఖ

వివరాలు 2లో..

# రేవంత్ రూపంలో ఉన్న వినాయక విగ్రహాన్ని తొలగించాలని రాజాసింగ్ డిమాండ్



- హైదరాబాద్ అఘాపురాలో సీఎం రేవంత్ రూపంలో గణేశ్ విగ్రహం
- రేవంత్ రెడ్డి దేవుడు కాదన్న రాజాసింగ్
- హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీస్తాయని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపంలో ఏర్పాటు చేసిన ఓ గణనాథుడి విగ్రహం వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. గోషామహల్ నియోజకవర్గం

వివరాలు 2లో..

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం



- ఏడేళ్ల తర్వాత తొలిసారిగా చైనాకు ప్రధాని నరేంద్ర మోదీ
- గల్వాన్ లోయ ఘర్షణల అనంతరం ఇదే మొదటి పర్యటన
- ఎస్సీఓ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రత్యేక భేటీ
- ఆదివారం టియాంజిన్‌లో ఇరు దేశాధినేతల ద్వైపాక్షిక చర్చలు
- సరిహద్దు పెట్రోలింగ్‌పై ఒప్పందం తర్వాత మెరుగుపడుతున్న సంబంధాలు

హైదరాబాద్ పెన్ పవర్:భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసు కోనుంది. సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణల అనంతరం, ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వివరాలు 2లో..

# మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు



- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'
- బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు తొలగించారని రాహుల్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్య
- బాధితుల్లో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలవారేనని ఆరోపణ
- ఓట్ల దొంగతనంపై మరిన్ని ఆధారాలు బయటపెడతానన్న రాహుల్

పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, 'ఓట్ చోర్– గద్దీ ఛోడ్' అనే నినాదంతో ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఈరోజు సీతామఢీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి

వివరాలు 2లో..

# హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి

- వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే రేవంత్ రివ్యూలతో కాలక్షేపం చేస్తున్నారన్న హరీశ్
- రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని ఫైర్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మెదక్‌లో ఇద్దరు చనిపోయారని ఆరోపణ



హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా" సీఎం తీరు ఉందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఒకవైపు ప్రజలు వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతుంటే, సీఎం మాత్రం మూసీ సుందరీకరణ,

వివరాలు 2లో..

ఆ ఇద్దరినీ కలిపిన వరద.. బండి, కేటీఆర్ మాటామంతి..

# కార్యకర్తల పోటాపోటీ నినాదాలు

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన బండి సంజయ్, కేటీఆర్
- గంభీరావుపేట మండలంలో ఎదురుపడ్డ ఇరువురు నేతలు
- వరద పరిస్థితిని కేంద్ర మంత్రికి వివరించిన కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర రాజకీయా ల్లో ఉప్పు నిప్పులా ఉంటే కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్ ను వరద కలిపింది. వీళ్లి ద్దరూ అనూహ్యంగా వరద ప్రాంతాల పర్యటన లో కలుసుకున్నారు.

వివరాలు 2లో..

# మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం


- ట్రంప్ టారిఫ్ లు తగ్గించుకునే అవకాశం భారత్ చేతుల్లోనే ఉందన్న పీటర్ నవారో
- రష్యా నుంచి చమురు కొనడం ఆపేసిన మరునాడే అదనపు సుంకాలు రద్దు
- ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీ ప్రోత్సహిస్తున్నారంటూ ఆక్షేపణ



హైదరాబాద్ పెన్ పవర్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను తగ్గించుకునే అవకాశం భారత్ కు ఇప్పటికీ ఉందని వైట్ హౌస్ సలహాదారు, ఆర్థిక వేత్త పీటర్ నవారో పేర్కొన్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపేసిన మరుసటి రోజే అదనపు సుంకాలు రద్దు చేస్తామని చెప్పారు.

వివరాలు 2లో..

# శభాష్ హైడ్రా.. రాంనగర్ కూల్చివేతలపై అభినందించిన హైకోర్టు




హైదరాబాద్ పెన్ పవర్: హైడ్రా కూల్చివేతలపై ఒకవైపు విమర్శలు మరో వైపు ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి. రామ్ నగర్ లో కూల్చివేతలపై హైడ్రా ను హైకోర్టు అభినందిం చింది. ప్రజా ఆస్తుల రక్షణలో హైడ్రా అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

వివరాలు 2లో..

# ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదుల చొరబాటు
- నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్
- ఉగ్రవాదుల ఫొటోలను విడుదల చేసిన పోలీసులు
- జైషే మహ్మద్ ఉగ్రవాదుల కోసం వేట



హైదరాబాద్ పెన్ పవర్:అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీహార్‌లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు నిఘా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## చంద్రబాబులో అప్పటికీ - ఇప్పటికీ ఎంత తేడా? గమనించారా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో చాలా మార్పు కనిపిస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంలో దృష్టి పెట్టడం పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మూడు దఫాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తీసుకోని రాజకీయ పరమైన నిర్ణయాలు ఈ సారి మాత్రం తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు కానీ ఏమైనా తప్పులు చేస్తే వెంటనే చర్యలకు దిగేవారు కాదు. దానిపై సాగదీసేవారు. నాడు సోషల్ మీడియా ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో అటువంటి ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలను వేసేవారు. పార్టీ వారినే పంపి అందులో నిజాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవారు.

**కాలయాపన చేస్తూ...**

అయితే అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించారు. అంతే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలు చాలా తక్కువనే చెప్పాలి. ఎక్కువగా పార్టీ క్రమశిక్షణ కమిటీ, నిజనిర్ధారణ కమిటీలను నియమించి కాలయాపన చేస్తూ ఆ ఘటన మర్చిపోయిన తర్వాత షరా మామూలయ్యేది. కానీ ఇప్పుడు అలా కాదు. వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల విషయం తెలిసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఉండేవి కావని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

**గతంలో ప్రజా సమస్యలపై...**

ఇక గతంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఆందోళనలు చేసినా వెంటనే స్పందించే వారు కాదు. అలాగే విపక్ష నేతలు వెళ్లి అక్కడ పర్యటనలు చేసినా పట్టించుకునే వారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై ఆయన కఠినంగా వ్యవహరించారు నాడు. కానీ నేడు అలా కాదు. ఏ మాత్రం నిరసనలు, ఆందోళనలు కనిపించినా వెంటనే చంద్రబాబు రియాక్ట్ అవుతున్నారు. మిరప, పొగాకు, చిత్తూరు మామిడి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో విపక్ష నేత అక్కడ పర్యటనలకు చేయకముందే ఆ సమస్యపై స్పందించారు. తాజాగా దివ్యాంగులను నెలకు పదిహేను వేల రూపాయల పింఛన్లు తొలగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆందోళనకు దిగితే వెంటనే స్పందించి అర్హులైన అందరికీ ఇస్తామని ఆయనే చెప్పారు. ఇక స్మార్ట్ మీటర్ల విషయంలోనూ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు కమర్షియల్ భవనాలకే పరిమితం చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. చంద్రబాబులో వచ్చిన ఈ మార్పు చూసిన పార్టీ సీనియర్ నేతలు మాత్రం ఆశ్చర్యపోతున్నారు.

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం

- మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఈ కీలక భేటీ ఆదివారం జరగనుంది.జపాన్ లో తన రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ నేరుగా చైనాకు వెళ్లనున్నారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోదీ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, పెట్రోలింగ్ నిర్వహించడంపై ఇరు దేశాలు ఇటీవలే ఒక ఒప్పందానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సానుకూల వాతావరణంలో ఈ పర్యటన జరగనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా ఇరువురు నేతలు సమావేశమయ్యారు.

ఈ నెల 19న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయి, ఎస్సీఓ సదస్సుకు రావాల్సిందిగా జిన్‌పింగ్ పంపిన ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని మోదీ స్పందిస్తూ, "గతేడాది కజాన్‌లో అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల ప్రయోజనాలకు, సున్నితత్వాలకు పరస్పరం గౌరవం ఇచ్చుకుంటూ సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. టియాంజిన్‌లో జరగబోయే సమావేశం కోసం ఎదురుచూస్తున్నాను" అని 'ఎక్స్' (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు.ప్రధాని మోదీ పర్యటన ఇరు దేశాల సంబంధాల మెరుగుదలకు, అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భారత్‌లో చైనా రాయబారి జు ఫెయిహాంగ్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు దేశాల బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని, సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు పీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది.

# కామారెడ్డిపై క్లౌడ్ బరస్ట్

- మొదటి పేజీ తరువాయి

డోంగ్లి మండలంలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సిర్పూర్, పెద్దటాక్లి, హాసన్ టాక్లి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటుంబాలు తమ నివాసాలను ఖాళీ చేశాయి. కొందరు సమీపంలోని బంధువుల ఇళ్లకు వెళ్లగా, మరికొందరు డోంగ్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. చిన్నారులు, వృద్ధులతో సహా పలువురు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, పిట్లం మండలం కుర్తి గ్రామం బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఈ వరద ప్రభావిత ప్రాంతాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పర్యటించారు. ఆలయాల్లో తలదాచుకుంటున్న బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితుల కోసం తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి కొనసాగుతుండటంతో ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## భారీ వర్షాలు, వరదలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ముఖ్యమంత్రి స్వయంగా విహంగ వీక్షణం ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఏరియల్ సర్వే అనంతరం ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి, వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

**భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బుధవారం వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం ఈరోజు ఉదయం నుంచి వేగంగా పెరుగుతోంది. ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల ఇంకా నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది.

## రేవంత్ రూపంలో ఉన్న వినాయక విగ్రహాన్ని తొలగించాలని రాజాసింగ్ డిమాండ్

- మొదటి పేజీ తరువాయి

పరిధిలో నెలకొల్పిన ఈ విగ్రహంపై స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది హిందూ మనోభావాలను కించపరచడమేనని ఆరోపిస్తూ, విగ్రహాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే, వినాయక చవితి వేడుకల సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలోని అఘాపురాలో తెలంగాణ ఫిషరీస్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డిని పోలినట్లుగా రూపొందించారు. ఈ విషయం తెలుసుకున్న రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. "సీఎం రేవంత్ రెడ్డి దేవుడు కాదు, ఆయన రూపంలో విగ్రహం పెట్టడం సరికాదు" అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. ఈ విగ్రహాన్ని,

మండపాన్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. ముఖ్యమంత్రిపై గౌరవంతోనే విగ్రహం పెట్టి ఉండవచ్చని, కానీ ఇలాంటి చర్యలు హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. మత విశ్వాసాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన సూచించారు.

## హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి

- మొదటి పేజీ తరువాయి

ఒలింపిక్స్ నిర్వహణపై సమీక్షలు చేయడం దారుణమని అన్నారు.మెదక్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ బృందంతో కలిసి పర్యటించిన హరీశ్ రావు, రాజాపేట గ్రామంలో వరద నీటిలో కొట్టుకుపోయి మరణించిన సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇద్దరు అమాయకులు చనిపోయారని ఆరోపించారు. "రాజాపేటలో వరద ఉధృతికి ఇద్దరు వ్యక్తులు కరెంట్ స్తంభం ఎక్కి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించారు. దాదాపు నాలుగు గంటల పాటు సహాయం కోసం ఎదురుచూశారు. ఈ విషయం గురించి జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. చివరకు ఆ స్తంభం కూడా కొట్టుకుపోవడంతో వారు ప్రాణాలు విడిచారు" అని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.అత్యవసరాలకు వాడాల్సిన హెలికాప్టర్‌ను పంపి ఉంటే వారి ప్రాణాలు దక్కేవని, కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదని ఆయన అన్నారు. ఒక మంత్రి హెలికాప్టర్లను అత్యవసరాలకు మాత్రమే వాడాలని చెబుతారని, కానీ అధికార పార్టీ నేతలు మాత్రం పెళ్లిళ్లకు, బీహార్ రాజకీయాలకు వాటిని వాడుతున్నారని విమర్శించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కనీసం తాగడానికి నీరు లేక వర్షపు నీటినే తాగుతున్నారని, ధూప్ సింగ్ తాండా లాంటి అనేక గ్రామాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని కోరారు.

## ఆ ఇద్దరినీ కలిపిన వరద.. బండి, కేటీఆర్ మాటామంతి.. కార్యకర్తల పోటాపోటీ నినాదాలు

- మొదటి పేజీ తరువాయి

గురువారం (ఆగస్టు 28) వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సందర్భంగా కలవడంతో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.సిరిసిల్లలో పరద బాధిత ప్రాంతాలలో బండి సంజయ్ పర్యటించి వెలు తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా అక్కడికి చేరుకున్నా రు. యాదృచ్ఛికంగా ఎదురెదురు పడటంతో మర్యాద పూర్వకంగా కలుసుకుని పరస్పరం అభివాదం కరచాలనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరు ఏం మాట్లాడుకున్నారన్నదానిపై స్పష్టత లేదు. ఈ క్రమంలో రెండు పార్టీల నాయకులు ఈ ఆకస్మిక పరిణామాన్ని ఆస్వాదిస్తూ కేరింతలు కొడుతూ బండి, కేటీఆర్ ల నాయకత్వం వర్ధిల్లాలంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు.

## శభాష్ హైడ్రా.. రాంనగర్ కూల్చివేతలపై అభినందించిన హైకోర్టు

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ ను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దడంలో హైడ్రా కృషి ఎంతో ఉందని గురువారం (ఆగస్టు 28) హైకోర్టు పేర్కొంది. రాంనగర్ కూల్చివేతలపై హైకోర్టు అభినందించినట్లు హైడ్రా ప్రకటన విడుదల చేసింది. రహదారులు, పార్కులు, ప్రజా స్థలాలను కాపాడేందుకు హైడ్రా వంటి సంస్థలు కీలకం అని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. రామ్ నగర్ లో రోడ్డు ను ఆక్రమించి నిర్మించిన కమర్షియల్ బిల్డింగ్ ను గతంలో హైడ్రా కూల్చేసింది. హైడ్రా కూల్చివేతల పై హైకోర్టును ఆశ్రయించాడు ఓ వ్యక్తి. ఇవాళ (గురువారం ఆగస్టు 28) హైకోర్టులో విచారణ సందర్భంగా.. అక్రమంగా నిర్మించిన బిల్డింగ్ కూల్చివేత సబబేనని హైకోర్టు తెలిపింది. రాకపోకలకు ఆటంకం కలిగించే నిర్మాణాల తొలగింపులో హైడ్రా పాత్రపై హైకోర్టు ప్రశంసించింది. ప్రజా ఆస్తులు, నీటి వనరుల సంరక్షణలో హైడ్రా చర్యలు ప్రశంసనీయమని హైకోర్టు వ్యాఖ్యానించినట్లు హైడ్రా ప్రకటన విడుదల చేసింది.

## ఈ సమయంలో ఒలింపిక్స్ క్రీడల గురించి సమీక్ష చేస్తారా?

- మొదటి పేజీ తరువాయి

హెచ్చరికలు జారీ చేసినా, ప్రభు త్వంలో మాత్రం ఎలాంటి చలనం లేదని కేటీఆర్ ఆరోపించారు. క్లిష్ట సమయంలో ప్రజల సమస్య లను పరిష్కరించడం విస్మరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలింపిక్స్ నిర్వహణ, మూసీ నది సుందరీకరణ వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం

- మొదటి పేజీ తరువాయి

ఇక దీనిపై నిర్ణయం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ పరిణతి చెందిన నాయకుడని కీర్తిస్తూనే ఆయన ఎందుకు ఇలా చేస్తున్నారో అంతుబట్టడం లేదని నవారో విమర్శించారు.

ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీనే కారణమని ఆక్షేపించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని, ఇది 'మోదీ యుద్ధం' అని నవారో ఆరోపించారు. భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు.రష్యా నుంచి రాయితీపై భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురు వల్ల ఉక్రెయిన్ పై దాడులు పెరుగుతున్నాయని పీటర్ నవారో చెప్పారు. ముడి చమురు అమ్మకాల ద్వారా సమకూరుతున్న డబ్బుతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెచ్చిపోతున్నారని, ఉక్రెయిన్ లో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొనాలంటే భారత్ సహకరించాలని పీటర్ నవారో అభిప్రాయపడ్డారు.

## ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- మొదటి పేజీ తరువాయి

వర్గాలు హెచ్చరించాయి. ఈ సమాచారంతో అప్రమత్తమైన బీహార్ పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్, బహవల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్ అనే ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు నేపాల్ సరిహద్దు ద్వారా బీహార్‌లోకి చొరబడ్డారు. గత వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నిర్ధారించాయి. దీంతో అధికారులు వెంటనే వారి ఫోటోలు, ఇతర వివరాలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించారు.ముఖ్యంగా నేపాల్‌తో 729 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటున్న జిల్లాలు, సీమాంచల్ ప్రాంతంలో భద్రతను గణనీయంగా పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనసమ్మర్థ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో కూడా రాష్ట్రంలో 18 మంది అనుమానితులను గుర్తించగా, వారిలో ఒకరు ఖలిస్థానీ సానుభూతిపరుడిగా తేలడం గమనార్హం.

## మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

- మొదటి పేజీ తరువాయి

సుమారు 65 లక్షల మంది పేర్లను అక్రమంగా తొలగించారని, ఇది ఓట్ల దొంగతనం కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్లను దొంగిలిస్తున్నాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోనూ ఇదే విధంగా చేశారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, బిహార్ ప్రజలు తమ ఓట్లను దొంగిలించడానికి అంగీకరించరు" అని హెచ్చరించారు. తొలగించిన ఓట్లలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందినవేనని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని రాహుల్ స్పష్టం చేశారు.

కొంతమంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ఆయన విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా దొంగిలించిన ఓట్లతోనే ఏర్పడిందని, ప్రధాని సైతం ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని సంచలన ఆరోపణలు చేశారు. యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ స్థానిక సీతాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నెల 17న ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర' 16 రోజుల పాటు 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో ఈ యాత్ర ముగియనుంది.

# నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గా శ్రీనివాసరావు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 28) :**నర్సీపట్నం మున్సిపాలిటీ అబీద్ సెంటర్‌లోని శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయానికి కొత్త కమిటీని గురువారం ఉదయం అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులను రాజేష్ కండువాలు కప్పి పరిచయం చేశారు. ఆలయ చైర్మన్‌గా కొరుప్రోలు శ్రీనివాస్‌రావు, వైస్ చైర్మన్‌గా దాడి శ్రీను బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులందరినీ ఈవో సాంబశివరావు ప్రమాణస్వీకారం చేయించారు.

చింతకాయల రాజేష్ మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు నూతన ఆలయ కమిటీ ఏర్పాటు జరిగింది. గత ఐదు సంవత్సరాలుగా అమ్మవారి పండుగలు అంతంత మాత్రంగానే జరిగాయని, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో అంగరంగ వైభవంగా జాతర నిర్వహించామని అన్నారు. అలాగే, గత టిడిపి ప్రభుత్వంలో ఆలయ నిర్మాణానికి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు పది లక్షలు విరాళంగా ఇచ్చినందున, దేవాదాయ శాఖ నుంచి 40 లక్షల రూపాయలు కేటాయించబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ నిధులతో నిర్మాణం వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో ప్రారంభమైనప్పటికీ, స్లాబ్ లీకేజీలు, గర్భగుడిలో నిర్మాణ లోపాలు వంటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. తాజాగా గుడి పూర్తి కోసం మళ్లీ స్పీకర్ కుటుంబ సభ్యులు మరో 10 లక్షలు చెల్లించగా, దేవాదాయ శాఖ మరో 40 లక్షల రూపాయలు కేటాయించిందని తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తవుతుందని, కొత్త కమిటీపై అమ్మవారి పండుగలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉందని సూచించారు.

ఆలయ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పండుగను అత్యంత వైభవంగా జరిపామని, ఇకపై అమ్మవారి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ జాలుమూరి బంగార్రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, రావణాపల్లి ఆవ చైర్మన్ రాజేశ్వరరావు, కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, లాలం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దుంబ్రిగుడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీఐ.



**దుంబ్రిగుడ, పెన్ పవర్, ఆగస్టు 28:** స్థానిక మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను అరకు సి ఐ హిమగిరి గురువారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా పనిచేసి ప్రజా మన్ననాలు పొందాలన్నారు. మండలంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు ముగింపు అనంతరం నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా చవితి విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులకు ఎటువంటి అల్లర్లు లేకుండా చూడాలని సలహా సూచనలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి పాపినాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు.



**దుంబ్రిగుడ, పెన్ పవర్, ఆగస్టు 28:** వినాయక చవితి ఉత్సవాలను స్థానిక మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కించమండ, అరుకు, గుంతసీమ పంచాయతీ కేంద్రాలతో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమ పాఠశాల, కేజీబీ పాఠశాలల్లో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు పండగ జరుపుకుని సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి వెంకట్రావు, అల్లూరి యూత్ అధ్యక్ష, కార్యదర్శులు కె సూర్య, ఎం నవసూర్య, జి ఉదయ్ స్వరూప్, సురేంద్ర, మాజీ జెడ్పిటిసిఎం శ్రీరాములు, వైసిపి నాయకులు ఏం శంకర్రావు, కె విజయదశమి, టిడిపి నాయకులు ఎం స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం యువ బాక్సర్లకు బంగారు పతకాలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగష్ట్ 28) :**తిరుపతిలో జరిగిన అమరావతి అండర్-22 కేటగిరి చాంపియన్‌షిప్ కప్ 2025 రాష్ట్రస్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం అమ్మాయిలు మరోసారి ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళా బాక్సర్లు యర్రా తేజస్విని (81 కేజీలు), బొంతు మౌనిక (75 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించి విశేష గౌరవాన్ని అందుకున్నారు. విజేతలకు క్రీడా రంగంలో మరింత ప్రోత్సాహకరంగా, ఈ నెల 29న విశాఖపట్నంలో జరగనున్న స్పోర్ట్స్ డే వేడుకలలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్, శాప్ చైర్మన్, రాష్ట్ర స్పోర్ట్స్ మంత్రి సమక్షంలో మెడల్స్, నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఈ విజయం వెనుక మహిళా కోచ్ వేపాడ ప్రియాంక ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు. యువ బాక్సర్లకు శిక్షణ అందించిన శాప్ బాక్సింగ్ కోచ్ అబ్బు వారి గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు. నర్సీపట్నం నుంచి జాతీయ స్థాయిలో బంగారు పతకాలు తెచ్చి ప్రతిభ చాటిన తేజస్విని, మౌనికలను నింజాస్ అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణ, సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, వెలగా జగన్నాద్ బంగారునాయుడు అభినందించారు. విజేత బాక్సర్ల తల్లిదండ్రులతో పాటు శాప్ ఆధ్వర్యంలో ఈమెడలిస్టులకు రూ.30,000 నగదు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేయనున్నట్లు ప్రకటించారు. నర్సీపట్నం క్రీడా ప్రస్థానంలో ఈ విజయాలు మైలురాయిగా నిలుస్తాయని స్థానిక క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.

## సవరబాస వాలంటీరుల ను నిర్మించాలి.

- మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సవరభాస వాలంటీరు నియమించాలి.
- భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్.



**గుమ్మలక్ష్మీపురం, కురుపాం 28.పెన్ పవర్:** కురుపాం మండలం జి.శివడ పంచాయితీ మధురవలస గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సవరభాసవాలంటరి నియమించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ మన్యం జిల్లా ఉపాధ్యక్షులు గంగారావు,జిల్లా కమిటీ సభ్యులు సింహాచలం పార్వతిపురం ఐటీడీఏ విద్యాశాఖ అధికారి గారికి వినతి పత్రన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కురుపాం మండలం జి.శివడ పంచాయతీ మధురవలస,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 15 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని అందులో ఐదుగురు విద్యార్థులు సవర భాష విద్యార్థులని కానీ మాతృభాషలో బోధించేందుకు అధ్యాపకులు లేరని దీనివల్ల అక్కడ విద్యార్థులకు మాతృభాష అధ్యాపకం దూరమవుతుందని అన్నారు తక్షణమే వాళ్లకు భాషా వాలంటరీను నియమించాలని డిమాండ్ చేశారు.

## అంగరంగ వైభవంగా వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు.

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైసిపి మాజీ మంత్రులు  మాజీ ఎమ్మెల్యేలు.**





**పరవాడ( పెన్ పవర్) ఆగస్టు 28:** మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పైల అప్పలనాయుడు రాజకీయ వారసుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసురావు జన్మదిన వేడుకలు గురువారం స్థానిక వైసిపి కార్యాలయ ఆవరణలో అంగరంగ వైభవంగాజరిగాయి.వైసిపి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు%ఎ% ముఖ్య అతిథులుగా పాల్గొని పైలాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, మాజీ ఉప ముఖ్యమంత్రి పీఏసీ సభ్యులు బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్ రాజ్, కరణం ధర్మశ్రీ, తయినాల విజయకుమార్, అరకు పార్లమెంట్ పరిశీలుకులు బొడ్డెడా ప్రసాద్ తదితరులు పాల్గొని పైలా చేత జన్మదిన కేకును కట్ చేయించి, శాలువాలతో సత్కరించి, గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ పైల శ్రీనివాసరావు పదిమందికి తోడుగా నిలిచే వ్యక్తిత్వం కలవారని, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడానికి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడును పైల అభిమానులంతా టైగర్ అని పిలుచుకునే వారిన అతని వారసుడిగా పైలా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తున్నారని అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా మంచి పేరు సంపాదించుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో తరించాలని ఆకాంక్షించారు. పి.ఎ.సి సభ్యులు బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ పైల శ్రీను పార్టీకి విశ్వసనీయమైన నాయకుడన్నారు. నిబద్ధతతో పనిచేసే ఆయనలాంటి వ్యక్తులు ఉండటం పార్టీకి గొప్ప బలం అని అతను చేస్తున్న కృషి అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. ప్రజలతో కలిసిపోతూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతుండటం శుభపరిణామం అన్నారు. జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అదీప్ రాజ్ మాట్లాడుతూ పైల శ్రీనివాసరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఎన్నో ఉన్నతమైన పదవులు చేపట్టి ప్రజలకు అండగా నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వుడా మాజీ చైర్మన్ రవిరాజ్, జడ్పీటీసీ పి.ఎస్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జై రాం, సబ్బవరం ఎంపీపీ బొకం రాము నాయుడు సూర్యకుమారి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పెందుర్తి జడ్పీటీసీ ఇప్పిలి కనకరాజు, జాతీయ బి.సి సంఘం అధ్యక్షులు కోటన రాము, ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రాము నాయుడు, మండల వైస్ ఎంపీపీలు బూస అప్పలరాజు, బంధం నాగేశ్వరరావు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైసిపి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, పైల అభిమానులు, బొంకులదిబ్బ యూత్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జీకే వీధి నూతన ఎస్ఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన పాత్రికేయులు





**గూడెం కొత్త వీధి, ఆగస్ట్ 28:** గూడెం కొత్త వీధి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఎస్సై కె. సురేష్‌ను గురువారం గూడెం కొత్తవీధి విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ, "ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో మీడియా సహకారం ఎంతో కీలకం. సమాచారాన్ని సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో మీ సహకారం మాకు అవసరం. ప్రజలతో మా అనుబంధాన్ని బలోపేతం చేయడంలో విలేకరుల పాత్ర ఎంతో గొప్పది" అని తెలిపారు. ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసిన విలేకరుల్లో జీకే వీధి విలేకరుల సంఘం అధ్యక్షుడు సాయం రమణ (ప్రజా ప్రతిభ), సుర కత్తి లక్ష్మణ్ బాబు (ఈనాడు), బండి ధారబాబు (ఆంధ్రజ్యోతి), మాదిరి చంటిబాబు (పెన్ పవర్), సాగిన లక్ష్మణరావు (ఆంధ్రప్రభ), గబులంగి హనుమంతరావు (విశాలాంధ్ర), బోండ్ల గాంధీ (నిజం), సాగిన శివకుమార్ (జ్యోతి), బత్తుల తారక రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


## మండల విభజనకు ఏ.దారకొండ, గాలికొండ పంచాయతీల ప్రజలు దూరం






**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 28:**రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, మండలాలు పునర్విభజన చేయడం నేపథ్యంలో, కొత్తగా ఏర్పడుతున్న దారకొండ మండలానికి సంబంధించిన వివాదంలో ఏ.దారకొండ, గాలికొండ పంచాయతీల ప్రజలు మండల విభజనకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. గూడెం కొత్తవీధి మండలానికి ఈ రెండు పంచాయతీలు భౌగోళికంగా సుమారు 12-14 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్నాయని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉన్నందున గూడెం కొత్తవీధి మండలంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ప్రతిపాదితమైన దారకొండ మండల కేంద్రానికి తమ పంచాయతీలు కలపబడటాన్ని ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. "ఇప్పటికే జిల్లాలు విడిపోయిన నేపథ్యంలో ఆధార్, రేషన్ కార్డుల మార్పు వంటి సాంకేతిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు మళ్లీ మండల విభజన చేయడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బందులు తప్పవు" అని ఏ.దారకొండ పంచాయతీ సర్పంచ్ ముర్ల సత్యవతి, వైస్ సర్పంచ్ ముర్ల చంటిబాబు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు చిలకల కృష్ణారావు తెలిపారు. దారకొండ మండల సాధన కమిటీ పోరాటానికి తమకు వ్యతిరేకత లేదని స్పష్టంగా పేర్కొన్న వారు, తమ పంచాయతీలను దారకొండ మండల కేంద్రంగా కలపకూడదని కోరారు."మా ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, మా పంచాయతీలు గూడెం కొత్తవీధి మండలంలోనే కొనసాగించాలని కోరుతున్నాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తుల్లో చిలక లక్ష్మయ్య, చంటిబాబు, శ్రీనుబాబు, పండయ్య, చిన్నబ్బాయి, ఆనందరావు, చిట్టిబాబు, పండన్న, కృష్ణారావు, రాము, కొండబాబు, కోటేశ్వరరావు, నాగమణి తదితరులు ఉన్నారు.

# చలువ పందిళ్ళలో కొలుదీరిన గణనాధుడు







**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్ట్ 27) :**నర్సీపట్నం మున్సిపాలిటీలో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బాద్రపద శుద్ధ వినాయక చవితి పురస్కరించుకొని అన్ని వార్డులలోనూ నవరాత్రులు నిర్వహిస్తూ మండపాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఐదు రోడ్ల జంక్షన్ వద్దనున్న బాల వినాయక ఆలయానికి, రామారావుపేటలోని సంపత్ వినాయక ఆలయానికి వేకువ జాము నుండే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. చలువ పందిళ్ళలో రకరకాల ఆకృతులతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. నర్సీపట్నం అయ్యరకవీధిలో నూకాంబిక ఆలయం వద్ద 25 అడుగుల భారీ విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. నర్సీపట్నం మొత్తానికి ఇదే ఎత్తైన విగ్రహం. నూకాంబిక యూత్ ఆధ్వర్యంలో, వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సహకారంతో ఇక్కడ నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నూకాంబిక యూత్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించడంతోపాటు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ చైర్మన్ కర్రి చిన్న తెలిపారు. అదేవిధంగా శాంతినగర్ లోని 18 రకాల పప్పు దినుసులతో ఏర్పాటు చేసిన విద్యా గణపతి విగ్రహం మున్సిపాలిటీకే హైలెట్గా నిలిచింది. వృత్తిరీత్యా స్వర్ణకారుడైన వానపల్లి శ్రీను ప్రతి ఏటా వినూత్న వినాయక విగ్రహాలను తయారు చేస్తూ ఉంటాడు. అదేవిధంగా ఈ సంవత్సరం పర్యావరణ హితం కోరుతూ ఐదు అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, దానికి 18 రకాల పప్పు దినుసులను అమర్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. ఈ విగ్రహాన్ని చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. కోమటివీధి రామాలయం వద్ద, కృష్ణా బజార్ వద్ద సుతాపల్లి కుటుంబం ఆధ్వర్యంలో, బలిఘట్టంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో మరియు వివిధ వార్డులలోను వినాయక మండపాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్పీకర్ అయ్యన్న తనయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మున్సిపాలిటీలోని పలు వార్డులలో వినాయక మండపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావం వెల్లివిరుస్తుందని, తెలుగు పండగలలో ఆది పండుగ అయిన వినాయక చవితిని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి మండపాలు ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా ప్రజలలో ఐక్యత భావం ఏర్పడుతుందన్నారు. వినాయక మండపాలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇవ్వడమే కాకుండా, మండపాలకు ఉచిత విద్యుత్ ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



## భారీ వర్షాలకు అతి పురాతనమైన కట్టడం నేలకొరిగింది



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 28 :**విశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వ వార్డు ప్రాంతంలో దుర్గాకాలనీ కల్లుపాకలు ఏరియాలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కారణంగా అతి పురాతనమైన కట్టడం పోలీస్ బేరాక్సు సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మాణమై ఉన్నందున జోరుగా కురుస్తు న్న వర్షాలకు కొన్ని రోజుల నుంచి తడిచి ఉండ టం వల్ల గోడ కూలిపోయింది, ఈ ప్రాంతంలో కల్లుపాకల ఏరియాలో ఉంటున్న లబ్ధిదారులు క్షతగాత్రులు కి వారందరికీ కూడా విశాఖ దక్షిణ నియోజ కవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ మరియు 35 వ వార్డు కార్పొరేటర్ జీవీఎంసీ మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ విల్లూరి భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి వారంద రికీ కూడా మెరుగైన వైద్యం కే.జీ.హెచ్ లో ఏర్పాటు చేసి ప్రభుత్వం తరపున బాధితులకు జరిగిన ఆర్థిక నష్టాన్ని పూడుస్తామని, ఈ ప్రాంత ప్రజలందరూ కూడా రోజువారి వ్యాపారం చేసు కునే వాళ్ళు తోపుడు బల్లు మోటార్ సైకిల్లు ఏవై తే నష్టపోయారు, ఆ నష్టాన్ని ఆర్థిక రూపం లో ప్రభుత్వం తరపున భర్తీ చేస్తానని హామీ ఇవ్వ డం జరిగినది తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్య కర్తలు పాల్గొని వారందరూ కూడా బాధితులకు భరోసా ఇవ్వడం జరిగినది కార్యక్రమంలో 35వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొచా రామిరెడ్డి కూడా పాల్గొన్నారు

## 16 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు నిరుద్యోగుల కలల నిజం చేసిన మెగా డీఎస్సీ



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, ఆగస్టు 28** :కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి, 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం చారిత్రాత్మకమని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు.మునుపటి వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో రికార్డు స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించబడటం వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిందని అన్నారు.విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి విద్యా వ్యవస్థలో లోపాలు సరిదిద్దబడుతున్నా యని తెలిపారు. "తల్లికి వందనం" పథకానికి రూ.325 కోట్లు విడుదల చేయడం, విశాఖలో రైల్వే జోన్, లూలు మాల్, రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్, ఐటీ విస్తరణ, మెట్రో ప్రాజెక్ట్ పునరుద్ధరణ,కూటమి సంకల్పానికి నిదర్శనమ ని పేర్కొన్నారు.

# సిలెండర్ ప్రేలుడు ఘటనలో మృతుని కుటుంబాన్ని ఆదుకున్న ప్రభుత్వం

- **10 లక్షల రూపాయల చెక్కును మృతుని కుటుంబానికి అందజేసిన లి**
- **ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఎంఆర్ఓ పాల్ కిరణ్**
- **మృతునికి టిడిపి సభ్యత్వం ఉన్నందున మరో ఐదు లక్షల రూపాయలు త్వరలో అందజేస్తాం**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 28:** ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాప్ వద్ద గ్యాస్ సిలెండర్, పేలుడు జరిగిన ప్రమాదంలో ప్రమాద ఘటన స్థలంలోనే ముగ్గురు చనిపోగా మిగిలిన ముగ్గురు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతూ మరణించారు. గతంలో మూడు కుటుంబాలకు ప్రభుత్వం పది లక్షల రూపాయలు చొప్పున మూడు కుటుంబాలకు అందజేయడం జరిగింది. మిగిలిన వారికి కూడా విడతల వారీగా అమలు అందజేశారు. విశాఖ తూర్పు 12,వవార్డు ఆరిలోవ రాజీవ్ నగర్ కు చెందిన తాండ్రంగిసన్యాసిరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అతని భార్య,తాండ్రింగి సంతోషి, నకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం 10 లక్షలు రూపాయలు చెక్ ను శాసన సభ్యులు, వెలగపూడి రామకృష్ణ బాబు చిన్నగదిలి రూరల్ ఎమ్మార్వో పాల్ కిరణ్. మృతుని ఇంటికి వచ్చి వాటిని పరామర్శించి 10 లక్షల రూపాయల చెక్కును వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరణించిన సన్యాసిరావు టీడీపీ సభ్యత్వంతీసుకున్నందున, పార్టీ ద్వారా త్వరలో 5,లక్షలు రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. పిల్లలు చదువు కు సహాయం చేయమని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరగా స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి సహాయం చేస్తామనియు కుటుంబానికి భరోసాఇచ్చారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు,వార్డు అధ్యక్షులు గాడి సత్యం,వార్డు ఇంచార్జి,ఒమ్మి అప్పలరాజు, పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడువాక సన్యాసి రావు,గోపల్లి రామకృష్ణ,రాపర్తి గణపతి.లక్ష్మి,రమా,శారోన్ స్థానిక సంఘము సభ్యులు పాల్గొన్నారు.



## జర్రెల బ్రిడ్జిపై నీటి ప్రవాహం... ప్రజలు భయంతో ప్రయాణం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 28**: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని జర్రెల పంచాయతీలోని ప్రధాన కేంద్రం వద్ద ఉన్న బ్రిడ్జి ప్రజలకు తలనొప్పిగా మారింది.ఈ బ్రిడ్జి రెండు వీధులను కలుపుతుంది.అయితే వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు పొంగిపొర్లి ప్రవహిస్తుంది. దీంతో ఈ మార్గాన్ని ఉపయోగించే ప్రయాణికులు తీవ్ర భయంతో ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ బ్రిడ్జిని దాటి మరో రెండు పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో ఈ మార్గం పూర్తిగా నిలిచిపోతుండటం ప్రజల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.పరిస్థితిని పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ సైతం జిల్లా ఎస్పీతో కలిసి పరిశీలన చేసినప్పటికీ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అడుగులు వేయకపోవడం బాధాకరమని ప్రజలు తెలిపారు."ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకముందే ప్రభుత్వం స్పందించి, ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలి" అంటూ స్థానికులు లువ్వాబు మత్స్యారాజు, సాగిన అనిల్ కుమార్, సాగిన ఉపేంద్ర, వండలం బాలరాజు తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గాలికొండ,ఏ.దారకొండ పంచాయతీలు జీకే వీధి మండలంలోనే కొనసాగాలని తహసీల్దార్ కు వినతి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ , ఆగస్టు 28**:మండలాల పునర్విభజన నేపథ్యంలో గాలికొండ మరియు ఏ.దారకొండ పంచాయతీలను గూడెం కొత్త వీధి మండలంలోనే కొనసాగించాలని కోరుతూ ఆ పంచాయతీల సర్పంచు,ఉప సర్పంచ్లు కె.బుజ్జిబాబు,ఎం. చంటిబాబు గూడెం కొత్త వీధి మండలం తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ రెండు పంచాయతీలు భౌగోళికంగా గూడెం కొత్త వీధి మండలానికి సమీపంగా ఉండటంతో ప్రజలకు అన్ని పరిపాలనా సేవలు సులభంగా అందుతున్నాయి. కొత్తగా ప్రతిపాదిత దారకొండ మండలానికి కలిపితే ప్రజలకు అనేక సమస్యలు తలెత్తే ప్రమాదముందని, ప్రత్యేకించి రవాణా, ప్రభుత్వ సేవలు, డాక్యుమెంట్ మార్పులు వంటి వాటిలో ఇబ్బందులు ఎదురవుతాయని వారు తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తూ గాలికొండ, ఏ.దారకొండ పంచాయతీలను గూడెం కొత్త వీధి మండలంలోనే కొనసాగించాలని వారు కోరారు.

## రంపులు ఘాట్లో విరిగిపడిన చెట్లు -ట్రాఫిక్కు అంతరాయం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 28:** కేడీపేట నుండి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారిలోని రంపులు ఘాట్ రోడ్డు ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షాలకు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో గంటకు పైగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు, వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం , ఎడతెరిపిలేని వర్షానికి చెట్లు దెబ్బతిని రోడ్డుపైకి కూలిపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ప్రొక్లెయినర్ సాయంతో చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.గంట వ్యవధిలో రోడ్డును పరిశుభ్రపరిచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.వర్షాకాలంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**సింహాచలం, పెన్ పవర్, ఆగస్టు 28 :** శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం సింహాచలానికి తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామివారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

దర్శనం అనంతరము కప్పస్తంభం ఆలింగణం చేసుకున్నారు. ఆలయ వేద పండితులు వేదమంత్రాల మధ్య ఆశీర్వచనం అందజేశారు. తరువాత ఆలయ పర్యవేక్షణ అధికారి స్వామివారి ప్రసాదాలు అందించారు.

## ప్రథమ గణనాథుని దర్శించుకున్న భక్తులు..

● హరిత వనంలో గణనాథుడు విహారం చూపరులను ఆకర్షిస్తున్న మండపం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 28:** జీవీఎంసీ...91 వ వార్డు పరిధి గణేష్ నగర్ లో ప్రథమ గణనాథుడు పర్యావరణ ప్రేమికుడు పచ్చని వనంలో విహరిస్తున్న గణనాథుని చూసేందుకు భక్తులు పర్యావరణాన్ని కాపాడండి అంటూ చక్కని సందేశంతో నిర్మించిన మండపం పలువురి భక్తులను ఆకర్షిస్తుంది..గణేష్ నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని పెద్ద ఎత్తున స్థానికులు దర్శించుకున్నారు. ప్రథమ గణనాథుడు అవతారంలో ఎకో ఫ్రెండ్లీ గణనాథుడి విగ్రహం పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనీ స్థానికులు అంటున్నారు. సుమారు 8 అడుగుల ఎత్తున గణనాథుడిని.11 రోజులపాటు నిత్య పూజలు నిర్వహించడం జరుగుతుందని దీపారాధన అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## ఏ.ఆర్. హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన జిల్లా ఎస్పీ



**అనకాపల్లి, పెన్ పవర్, ఆగస్టు 28 :** అనారోగ్యంతో మృతి చెందిన ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ వి.ఈశ్వరరావు కుటుంబానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆర్థిక సహాయం చేశారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకొని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనకాపల్లి జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వి.ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, రూ.2 12వేలు 200లు ఆర్థిక సహాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ ఆర్థిక సాయం డెత్ రిలీఫ్ ఫండ్, కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ ఫండ్ మరియు మంత్లీ సబ్‌స్క్రిప్షన్ సంబంధించిన నగదు చెక్ ను దివంగత హెడ్ కానిస్టేబుల్ సతీమణి వి.పద్మకి ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యులను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కన్నుమూయడం బాధాకరమని పేర్కొంటూ, పోలీసు శాఖ పూర్తిగా అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

## వార్డ్ ప్రెసిడెంట్, సెక్రటరీలతో సమావేశమైన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**గోపాలపట్నం, పెన్ పవర్, ఆగస్టు 28 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం కార్యాలయంలో ఆర్థికంగా స్త్రీలను బలోపేతం చేస్తూ ఏదిగేలా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ లో ఒకటైన స్త్రీ శక్తి పథకం కింద 2025 సెప్టెంబరు ఒకటి, సోమవారం మధ్యాహ్నం 2.గంలకు 90వ వార్డ్, ఎన్ఏడి కొత్త రోడ్, బస్ స్టాప్ నుండి మద్దిలపాలెం రూట్ నందు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో మహిళా కూటమి సభ్యులతో బహిరంగసభ నిర్వహించాదం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై పశ్చిమ నియోజకవర్గ మహిళ నాయకులు మరియు వార్డ్ ప్రెసిడెంట్ సెక్రటరీలతో సమావేశం అయ్యారు.

# ఎవరి స్వలాభం కోసం ఈ హైడ్రో పవర్ ప్రాజెక్ట్..?

అభివృద్ధి పేరుతో. గిరిజన ఆస్తులు కొల్లగొడితే చూస్తూ ఊరుకోం.ఆదివాసి గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటి







**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 28.** అల్లు సీతారామ జిల్లా హుకుంపేట మండలం. మజ్జి వలస.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మించవద్దు ఆదివాసుల అడవి,భూమి,నీరు పర్యావరణము నాశనం చేయవద్దని

మజ్జివలసలో జరిగిన ఆదివాసీ గ్రామసభ గర్జన లో తీర్మానం చేశారు

అనంతగిరి మండలం పెదకోట, చిట్టంపాడు,గుజ్జేలి ప్రాంతంలో అదని, నవయుగ ప్రైవేటు కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని మజ్జి వలస ఆదివాసీ గ్రామ సభ గర్జన డిమాండ్ చేసింది

రాష్ట్ర ప్రభుత్వం భుర్జ పంచాయతీ మజ్జి వలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఆగస్టు 28 తేదీన గ్రామ సభ ఏర్పాటు చెయ్యాలనీ నోటీస్ ఇచ్చింది.

భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణము జరిగితే 14 గ్రామంలో 5 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారనీ ఆగ్రహంతో పంచాయతీకి చెందిన వందలాది మంది ఆదివాసులు గ్రామసభకు హాజరయ్యారు

వందలాది మంది ఆదివాసులు ఆగ్రహాన్ని ప్రభుత్వం గమనించి మజ్జి వలసలో జరగవలసిన గ్రామ సభను తాత్కాలికంగా వాయిదా వేసింది మజ్జివలసలో జరిగిన ఆదివాసీ గర్జన గ్రామ సభ మరియు భారీ గర్జన ర్యాలీలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర మాట్లాడుతూ మాట్లాడుతూ

భుర్జ పంచాయతీలో 14 గ్రామ పరిధిలోని 5 వేల మంది ఆదివాసులు జలసమాధి చేస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు వేయాలనీ డిమాండ్ చేశారు

భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి నిర్మిస్తున్న సర్వే రాళ్ళు పగలుగొట్టాలని ఆదివాసులకు పిలుపిచ్చారు

ఆదివాసీలకు 5 వ షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ హక్కులైన పీసా చట్టం, అటవి హక్కుల,1/70 చట్టన్నీ ఉల్లంఘించి ప్రైవేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి వేల ఎకరాల అటవి, జీరయితి భూములు కేటాయించడాన్ని తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా. డిమాండ్ చేశారు

అనంతరం.అనంతగిరి జడ్పీటీసీ డి.గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జేలి, చిట్టంపాడు ప్రాంతంలో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 51 రద్దు చేయాలని డిమాండ్ చేశారు

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పీ బలదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదానీ,నవయుగ సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి అనుమతులు ఇచ్చి గుట్టు చప్పుడు లేకుండా గ్రామంలో సర్వేలు, ముమ్మరం చేసింది మార్కింగ్ రాళ్ళు నిర్మిస్తున్నది తక్షణమే సర్వేలు,మార్కింగ్ రాళ్ళు నిర్మినాలు ఆపాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండల కార్యదర్శి టీ.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భుర్జ పంచాయతీ ఎంపీటీసీ మజ్జి హరి,చర్పంచ్ కె. మొత్తి,ఉప సర్పచ్ లక్ష్మి,పిసా అధ్యక్ష విజయకుమార్. కార్యదర్శులు ప్రసాదు సురేష్ కుమార్,పరుశురాం,పంగి హరి,సొనపటి వార్డు నెంబర్ గాసన్న వరునకుమర్ బాలరాజు హుకుంపేట మండల సిపిఎం పార్టీ కార్యదర్శి వి.లక్మన్, గిరిజన సంఘం మండల నాయకులు కె. రామారావు,అనంతగిరి మండలం టోకురు పంచాయతీ చర్పంచ్ కిల్లో మోసియా మజ్జి వలస యువత కృష్ణం రాజు తోపాటు వివిధ గ్రామాలకు చెందిన గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ని కలిసిన బెహరా భాస్కరరావు

**ఎన్ఏడి, పెన్ పవర్, ఆగస్టు 28 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కల్యాణ్ ని జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు విశాఖపట్నం విమానాశ్రయములో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.





● మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ విజయ కుమార్

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, ఆగస్టు 28.** :విజయనగరం ఈగల్ బృందం ఆధ్వర్యంలో ఆగస్టు 28 న తోటపాలెం లో గల ఎస్.ఎస్. ఎస్.ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈగల్ హెచ్సీ విజయ కుమార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు భవిష్యత్తుకు అనర్థదాయకమన్నారు. ఒకసారి మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆయా అలవాట్ల నుండి బయటపడడం కష్టమ ని అన్నారు. ఒకసారి మాదక ద్రవ్యాలను వినియోగిస్తే కొద్ది రోజుల్లోనే వాటికి బానిసలు గా మారుతున్నారన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టుకోవాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లతో భవిష్య త్తు నాశనం చేసుకోవద్దన్నారు. ప్రాథమిక స్థాయి లో మాదక ద్రవ్యాల వినియోగించే అలవాటు ఉంటే డీ-అడిక్షన్ సెంటర్స్ లో అందించే చికిత్స ద్వారా స్వస్థత పొందవచ్చునన్నారు. కావున, యువత, విద్యార్థులు భవిష్యత్తు పై శ్రద్ధ పెట్టా లని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. గంజాయి, మత్తుపదా ర్థాలు గురుంచి ఏదైనా సమాచారం తెలిస్తే స్థాని క పోలీసు స్టేషన్ కి గాని, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు, ఎస్.ఎస్.ఎస్ డిగ్రీ కళాశాల లెక్చరర్స్, విద్యా ర్థులు పాల్గొన్నారు.

# నియోజవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధానమైన ధ్యేయం.. రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు :పల్లా





**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు 28:** మహావిశాఖ నగరపాలక సంస్థ 66వార్డు వార్డులో జీవీఎంసీ నిధులు సుమారు రెండు కోట్ల ఎనభై లక్షలు తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అజిమాబాద్ సున్ని జామా మసీదు వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు .శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ 66వ వార్డులో సీసీ రోడ్లు సిసి డ్రైనేజీ అలాగే సీసీ కల్వట్లకు రెండు కోట్ల 85 లక్షలతో వర్కులు పెట్టడం జరిగిందని అలాగే గాజువాకలో అతి పురాతనమైన అజిమాబాద్ సున్ని జామా మసీదు పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి తో మాట్లాడి ప్రత్యేకమైన నిధులు తీసుకొస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఇవే కాకుండా 66 వార్డులో ఇంకేమైనా పనులు పెండింగ్లో ఉంటే అవి కూడా శాసనసభ్యుడు దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 66 వార్డ్ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ 66 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ మరియు వార్డు అధ్యక్షుడు గోమాడవాసు వార్డు కార్యదర్శి ఎండి ముర్తజ వార్డు మైనార్టీ నాయకులు అన్సర్ వల్లి మోతి చెరుకూరి నాగేశ్వరరావు వార్డు కార్యదర్శి సాయిరాం లక్ష్మణరావు బుజ్జి లతా మున్వర్ అన్వర్ ఇమామ్ మౌలాలి మదిన వల్లి ఖాన్, జి సత్యనారాయణ పవన్ కుమార్ ,రమణ, మిశ్రా జీవీఎంసీ డిఈ ,ఏఈ పాల్గొన్నారు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ట్రంప్ కు మోడీ కౌంటర్ .. దెబ్బ అదిరిపోలా..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం అదనపు టారిఫ్‌లతో భారత ఎగుమతులపై గట్టి ప్రభావం పడే అవకాశముంది. ముఖ్యంగా జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్, ఆభరణాలు వంటి విభాగాల్లో ఇది తక్షణ ప్రభావాన్ని చూపనుంది. అయితే ఈ పరిణామాల నేపథ్యంలో న్యూఢిల్లీ వెనుకడుగు వేయకుండా ప్రత్యామ్నాయ వ్యూహాన్ని సిద్ధం చేసింది.

**40 దేశాల్లో మార్కెట్ విస్తరణ లక్ష్యం**

కేంద్రం రూపొందించిన కొత్త కార్యాచరణలో భాగంగా యూకే, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, యూఏఈ, ఆస్ట్రేలియా వంటి 40 దేశాల్లో ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించనున్నారు. ఈ ప్రోగ్రామ్‌ల ద్వారా భారత ఉత్పత్తులకు ఆ దేశాల్లో మరింత మార్కెట్ దక్కేలా చర్యలు చేపడతారు.

కేంద్రానికి చెందిన ఓ అధికారి ప్రకారం "నాణ్యత, సుస్థిరతలో భారత్ నమ్మకమైన సరఫరాదారుగా నిలవాలి. కొత్త తరహా టెక్స్‌టైల్ ఉత్పత్తులతో గ్లోబల్ మార్కెట్‌లో ప్రధాన పాత్ర పోషించాలన్నదే ఈ కార్యాచరణ వెనుక ఉద్దేశ్యం" అని తెలిపారు.

**మార్కెట్ మ్యాపింగ్, బ్రాండ్ ఇండియా విజన్**

ప్రతిపాదిత ప్రోగ్రామ్‌లలో మార్కెట్ మ్యాపింగ్, డిమాండ్ ఎక్కువగా ఉండే ఉత్పత్తులను గుర్తించడం, సూరత్, పానిపట్, తిరుపూర్, బదోహి వంటి ప్రధాన వస్త్ర పరిశ్రమ కేంద్రాల ఉత్పత్తులను విదేశాల్లో ప్రోత్సహించడం ప్రధానాంశాలుగా ఉన్నాయి. అంతర్జాతీయ ఎగ్జిబిషన్లు, వాణిజ్య మేళాలు, కొనుగోలు–విక్రయదారుల సమావేశాలు, 'యునిఫైడ్ బ్రాండ్ ఇండియా విజన్' కింద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.

ప్రస్తుతం భారత్ 220 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఇందులో ఈ 40 దేశాలు కీలకమైనవిగా భావిస్తున్నారు. ఏటా 590 బిలియన్ డాలర్లకు పైగా విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఇవి దిగుమతి చేసుకుంటున్నాయి. అందువల్ల ఈ దేశాల్లో మార్కెట్ షేర్ పెంచుకోవడం ద్వారా భారత్‌కు విస్తృత అవకాశాలు లభిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**పత్తి దిగుమతి సుంకం మినహాయింపు పొడిగింపు**

మరోవైపు, వస్త్ర పరిశ్రమకు ఊరట కల్పించేందుకు కేంద్రం పత్తి దిగుమతులపై సుంక మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించింది. ఇంతకుముందు 11 శాతం పన్ను ఉండగా, ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 30 వరకు మినహాయింపు ఇచ్చిన కేంద్రం, తాజాగా ఆ గడువును మరింత పొడిగించింది. ట్రంప్ టారిఫ్‌లతో ఎదురవుతున్న సమస్యను భారత్

వెనుకడుగు వేయకుండా అవకాశంగా మలుచుకుంటున్నది. కొత్త మార్కెట్లలో స్థిరపడటంతో పాటు, వస్త్ర పరిశ్రమకు ఊరట చర్యలు తీసుకోవడం ద్వారా న్యూఢిల్లీ గట్టి కౌంటర్ ఇచ్చినట్లే. అమెరికా ఒత్తిడి మధ్య భారత్ తన ఎగుమతి వ్యూహాన్ని మరింత బలపరచాలని నిర్ణయించుకుంది.

# ఆ ఇద్దరూ ముచ్చట... ఎంత బాగుందో కదా !



**హైదరాబాద్ పెన్ పవర్:** అవును ఆ ఇద్దరూ కలిసి నవ్వుతూ మాట్లాడుకుంటే ఎంత బాగుందో కదా అనిపిస్తోంది. ఆ ఇద్దరూ తెల్లారి లేస్తే సోషల్ మీడియా వేదికగా ఒకరి మీద ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటారు. అలాగే మీడియా ముందు కూడా ఒకరి మీద మరొకరు విరుచుకుపడతారు. అయితే ఇదంతా రాజకీయాల్లో భాగమే అని ప్రజా సమస్యల కోసమే అన్నది వారు రుజువు చేశారు. మళ్లీ పాతకాలం నాటి రోజులు గుర్తుకు తెచ్చారు. ఇంతకీ ఆ ఇద్దరూ ఎవరు అంటే కేంద్ర మంత్రి బీజేపీ నేత బండి సంజయ్, అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ ఇద్దరు ఎదురు ఎదురుగా తారసపడితే ఏమి జరిగింది అన్నదే అంతా ఆసక్తిగా చూసారు. అయితే ఈ ఇద్దరూ అలా చూసిన వారికి మరింత షాక్ ఇచ్చేశారు.

**సిరిసిల్లలో ఇంట్రెస్టింగ్ సీన్ :**

తెలంగాణలో భారీగా వానలు కురిసి అనేక జిల్లాలు వరద ముప్పులో చిక్కుకున్నాయి ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. దాంతో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటిస్తున్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్, అదే విధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా సిరిసిల్లాలోని గంభీరావుపేట మండలంలో పర్యటిస్తున్నారు. ఇలా ఒక చోట ఇద్దరూ ఎదురు అయ్యారు. అంతే అటు బీజేపీ ఇటు బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు అంతా ఆశ్చర్యంగా చూశారు. ఏమి జరుగుతుంది అన్న ఉత్కంఠ అందరిలో ఉంది. అయితే కేటీఆర్‌ని చూస్తూనే బండి సంజయ్ ఆయన దగ్గరగా వచ్చి హత్తుకున్నారు. కేటీఆర్ సైతం షేక్ హ్యాండ్ ఇచ్చి ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన భుజం మీద చేయివేశారు. బాగున్నారా అంటూ ఒకరికొకరు పలుకరించుకున్నారు. కష్టపడుతున్నారని అంటూ ఈ సందర్భంగా బండి సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**బండికి వివరించిన కేటీఆర్ :**

ఇదిలా ఉంటే స్థానికంగా ఉన్న వరద పరిస్థితులను కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కి కేటీఆర్ వివరించారు. అదే విధంగా బండి సంజయ్ కూడా ఆయన చెబుతున్నది జాగ్రత్తగా విన్నారు. ఇదంతా సోషల్ మీడియాలో వీడియోగా రావడంతో రెండు పార్టీల క్యాడర్ సైతం హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రజా సమస్యల సాధన కోసం రాజకీయాలు ఉన్నవి. వాటి మీదనే వేరు వేరు పార్టీలు అయినా విమర్శలు చేసుకుంటూంటాయి. అంతమాత్రం చేత ఎవరు ఎవరికీ శత్రువులు కాదు, గతంలో రాజకీయం అలాగే జరిగేది ఇపుడు అంతా మారింది. అయితే ఈ సమయంలో కూడా ఇద్దరు నాయకులు ఈ విధంగా ఆప్యాయంగా పలకరించుకోవడం క్యాడర్ కి ఇచ్చే మంచి సందేశమే అని అంటున్నారు.

**ఏపీలో ఊహించగలమా :**

ఇక ఏపీలో కూడా అధికార విపక్షాలు పరస్పరం విమర్శలు చేసుకుంటూంటాయి. అయితే నాయకులు ఎదురు పడితే ఇలాంటి సన్నివేశాన్ని ఊహించగలమా అని అంటున్నారు. తెలంగాణాలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఏదో సందర్భంలో కలుస్తూంటారు. అలయ్ బలయ్ పేరుతో చేసే కార్యక్రమాల్లోనూ వారు పాల్గొంటారు. ఇతర వేదికల మీద అంతా కలసి మెలసి ఉంటారు. ఏపీలో మాత్రం గవర్నర్ రాజ్ భవన్ లో ఇచ్చే తేనీటి విందుకు కూడా కలిసే పరిస్థితి లేదని అంటారు ఏపీలో కూడా రాజకీయం మారాల్సి ఉందని ఇలాంటి సందర్భాలను చూసినపుడు అంతా అనే మాటగా ఉంటుంది.

# మేఘాలు నీటి బాంబులు వేస్తాయా? వర్ష బీభత్సానికి కారణమేంటి?




**హైదరాబాద్ పెన్ పవర్:** వర్షా కాలంలో వర్షాలు కురవడం సాధారణం. ఒక్కోసారి ఆలస్యంగా ఒక్కోసారి సకాలంలో వర్షాలు పడతాయి. రుతు పవనాల గమనం ఆధారంగా ఈ వర్షాలు కురుస్తాయి. అదేవిధంగా అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపానులు ఇలా ప్రకృతిలో సంభవించే కొన్ని మార్పుల వల్ల కూడా వర్షాలు పడుతుంటాయి. ప్రకృతిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కొన్ని సార్లు కుంభవృష్టి వర్షం పడుతుంది. రెండు మూడు గంటల పాటు ఏకధాటిగా కురిసే భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకలు పొంగుతుంటాయి. కానీ, ఇప్పుడు ఇలా కుంభవృష్టి కురిస్తే వాగులు, వంకలు పొంగడమే కాదు ఏకంగా పట్టణాలు, నగరాలను ముంచేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా కురుస్తున్న ఈ వర్షాలకు కుంభవృష్టి అని చెప్పడంలేదు. ఈ అతిభారీ వర్షాలకు మేఘ విస్ఫోటనమని చెబుతున్నారు. ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా ఈ విపత్తు ఇటీవల కాలంలో తరచూ సంభవిస్తోంది.

వర్షాలు కురుస్తాయని, ఎండ తీవ్రంగా ఉంటుందని రెండు మూడు రోజుల ముందే వాతావరణ శాఖ హెచ్చరిస్తుంటుంది. ప్రజలను అప్రమత్తం చేస్తుంటుంది. కానీ, ఇప్పుడు ఎలాంటి సూచనలు లేదా హెచ్చరికలు లేకుండా మేఘాలు గర్జించి, విస్ఫోటనాలై పేలిపోతున్నాయి. గంట, అరగంట పాటు కురిసే వర్షానికే ప్రళయంగా మారుతుంది. ఇటీవల కాలంలో ఉత్తరభారత దేశంలో మేఘాల విస్ఫోటనంతో భారీ విపత్తులు సంభవిచ్చాయి. హిమాలయాల్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా ఒకేసారి వరదలు పోటెత్తాయి. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి విపత్తులు ఎవరూ చూడలేదు. పైగా పర్వత శాణువుల్లో ఇటువంటివి జరుగుతాయని టెక్నాలజీ కారణంగా ఇప్పుడు తెలుస్తుందని సరిపెట్టుకున్నారు. గత ఏడాది కూడా కేరళలో ఇలాంటి మేఘ విప్పోటనం వల్లే ఆకస్మిక వరదలు సంభవించి గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. కొండ చరియలు విరిగిపడి ప్రజలు సజీవ సమాధి అయ్యారు. ఇక తెలంగాణలో ప్రస్తుతం మేఘాలు గర్జిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనట్లు బుధవారం కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో మేఘాలు బద్ధలై ఆకస్మిక వరదలు సంభవించాయి. కామారెడ్డి పట్టణంలో కొన్నిచోట్ల ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా భవనాలు తొలి అంతస్తు వరకు మునిగిపోయాయి. దీంతో మేఘ విస్ఫోటనంపై తీవ్ర చర్చ జరుగుతోంది. గత వారం కశ్మీరు లోయ ఇదే తరహాలో క్లౌడ్ బరస్ట్ తో సుమారు 60 మంది ప్రాణాలు కోల్పోయారు. అదృష్టవశాత్తూ తెలంగాణలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కానీ, మేఘ విప్పోటనం వల్ల భారీ ప్రాణ, ఆస్తి నష్టాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. 2013లో ఉత్తరాఖండ్లో క్లౌడ్ బరస్ట్ వల్ల ఏకంగా 6 వేల మంది మరణించారు. వాతావరణశాఖ అంచనాకు దొరకకుండా కొద్ది ప్రాంతంలోనే కొద్ది సమయంలో ఉరుములు, మెరుపుల ఘర్షణల కారణంగా భయంకర కుండపోత వర్షంతో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి.

అతికొద్ది ప్రాంతంలో అపారమైన కుండపోత వర్షం ఆకస్మికంగా కురవడాన్ని మేఘ విస్ఫోటనంగా అర్థం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. రెండు మేఘాలు ఢీకొట్టడం వల్ల గంట, అరగంటలోనే 10 నుంచి 30 సెంటీమీటర్ల వర్షం నమోదు అవుతుంది. గాలి స్వల్పంగా వేడెక్కడం, గాలిలో తేమ పెరిగి ఆకాశం వైపు ప్రయాణించి, మేఘాలు అవక్షేపం చెంది కుండపోత వర్షానికి కారణం అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మేఘ విస్ఫోటనం ఆకస్మికంగా విధ్వంసంగా మారడం సర్వసాధారణంగా మారిపోయిందని అంటున్నారు. ఈ మేఘ విస్ఫోటనాలను వాతావరణశాఖ ముందస్తుగా గుర్తించడానికి అవకాశం లేనందున భారీగా ప్రాణ, ఆస్తినష్టాలు నమోదు అవుతున్నాయి. ఆకస్మికంగా భారీ వర్షాలు కురవడం వల్ల తీవ్రమైన వరదలు వస్తున్నాయి. దీంతో కొన్నిచోట్ల కొండ చరియలు విరిగిపడి అపార నష్టాలను చవిచూడాల్సి వస్తున్నదని చెబుతున్నారు. ఎత్తైన పర్వాలు ఉన్నచోట కూడా క్లౌడ్ బరస్ట్ సంభవిస్తోంది. మేఘాలకు పర్వతాలు అడ్డుగా ఉండటం, వేడి తేమ కలిగిన గాలిపైకి ప్రయాణించడం, చల్లబడటం వల్ల వేగంగా వర్షాలు పడుతున్నాయని అంటున్నారు.

# ఇన్ స్టాలో విడాకులు.. సింగర్ తో దుబాయ్ యువరాణి నిశ్చితార్థం



**హైదరాబాద్ పెన్ పవర్:** దుబాయ్ పాలకుడు.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె షేకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ (31) మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల తన భర్తకు విడాకులు ఇచ్చిన ఆమె, ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ రాపర్ ఫ్రెంచ్ మోంటానా (41)తో నిశ్చితార్థం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ విషయాన్ని ఫ్రెంచ్ మోంటానా ప్రతినిధి అధికారికంగా ధృవీకరించారు.

**ప్రేమ కథకు నాంది**

షేకా మహ్రా, ఫ్రెంచ్ మోంటానా ప్రేమకథ గురించి గత కొంతకాలంగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. విడాకుల తర్వాత దుబాయ్‌లో వీరిద్దరూ కలిసి కనిపించడం, పారిస్ ఫ్యాషన్ వీక్‌లో కలిసి పాల్గొనడం వంటి సంఘటనలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. ఈ ఏడాది జూన్‌లో పారిస్ ఫ్యాషన్ వీక్ సందర్భంగా నిశ్చితార్థం జరిగినట్లు మోంటానా ప్రతినిధి వెల్లడించారు. అయితే ఈ విషయాన్ని ఇప్పటివరకు గోప్యంగా ఉంచారు. రెండు కుటుంబాలు ఈ బంధాన్ని ఆమోదించాయని, త్వరలోనే పెళ్లి తేదీని ప్రకటిస్తారని సమాచారం.

**మొదటి వివాహం, విడాకుల సంచలనం**

షేకా మహ్రా గతంలో దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌ను వివాహం చేసుకున్నారు. 2023 మే 27న జరిగిన ఈ పెళ్లి కేవలం ఒక సంవత్సరం మాత్రమే కొనసాగింది. వారికి ఒక బిడ్డ కూడా ఉంది. 2024 జులైలో మహ్రా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో "ఐ డివోర్స్ యూ.. టేక్ కేర్" అని పోస్ట్ చేసి అందరినీ షాక్ గురిచేశారు. ఈ పోస్ట్ అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అంతేకాదు విడాకుల తర్వాత 'డివోర్స్' అనే పేరుతో ఒక ప్రత్యేక పర్ఫ్యూమ్‌ను కూడా విడుదల చేసి మరోసారి వార్తల్లో నిలిచారు.

**ఫ్రెంచ్ మోంటానా ఎవరు?**

మొరాకో–అమెరికన్ రాపర్ అయిన ఫ్రెంచ్ మోంటానా అసలు పేరు కరీమ్ ఖార్బుచ్. 'అన్‌ఫర్గెటబుల్' , 'నో స్టైలిస్ట్' వంటి పాటలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. గతంలో నదీన్‌ను వివాహం చేసుకున్న మోంటానాకు విడాకుల తర్వాత 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.

**ప్రజల స్పందన**

ఈ నిశ్చితార్థం వార్త బయటకు వచ్చిన తర్వాత, షేకా మహ్రాకు, ఫ్రెంచ్ మోంటానాకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత త్వరగా రెండో పెళ్లి నిర్ణయం తీసుకున్నందుకు షేకా మహ్రా ధైర్యాన్ని చాలా మంది ప్రశంసిస్తున్నారు. ఈ కొత్త బంధం గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ దుబాయ్ యువరాణి–అమెరికన్ రాపర్ బంధం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

# కుప్పం.. ఇకపై గ్లోబల్ బ్రాండ్.. సీఎం సొంత నియోజకవర్గంలో భారీ పరిశ్రమకు లైన్ క్లియర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో భారీ పరిశ్రమ స్థాపనకు హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ముందుకొచ్చింది. యాపిల్ ఐఫోన్ విడిభాగాలను సప్లై చేసే హిందాల్కో కుప్పంలో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరించింది. సుమారు రూ.586 కోట్లతో ఏర్పాటయ్యే ఈ పరిశ్రమతో వెయ్యి మందికి ప్రత్యక్షంగా మరో పది వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని అధికారులు హైలెట్ చేస్తున్నారు. త్వరలో జరిగే రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సమావేశంలో హిందాల్కో సంస్థకు అనుమతులు మంజూరు చేసే అంశాన్ని ఆమోదించనున్నారు.గత ఏడాది జూన్ 12న ఏపీకి నాలుగో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు.. గడిచిన 14 నెలలుగా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను స్థాపించడం అన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. దాదాపు 9 లక్షల కోట్ల మేర ఒప్పందాలు చేసుకుని 8 లక్షల ఉద్యోగాల సృష్టికి అడుగులు వేశారు. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న సంస్థలు కొన్నిచోట్ల నిర్మాణాలు ప్రారంభించగా, మరికొన్ని అనుమతులు అన్నీ రాగానే నిర్మాణ పనుల ప్రారంభానికి రెడీ అవుతున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మాత్రం ఇంతవరకు ఒక పెద్ద పరిశ్రమ కూడా లేదు. పూర్తిగా వ్యవసాయాధారిత నియోజకవర్గమైన కుప్పం చుట్టుపక్కల ప్రాంతాలను విద్య, వైద్య రంగాల్లోనే అభివృద్ధి చేసేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతవరకు దృష్టి పెట్టారు. కానీ, తొలిసారిగా కుప్పం నియోజకవర్గానికి ఉన్న భౌగోళిక పరిస్థితులను అంచనా వేసిన హిందాల్కో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.రెండు మెట్రో నగరాలకు అతి సమీపంలో ఉండటంతో కుప్పంలో అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని హిందాల్కో సంస్థ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కుప్పం నియోజకవర్గం బెంగళూరు మహానగరానికి 120 కిలోమీటర్లు, చెన్నై మెట్రో సిటీకి 200 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రెండు మెగా సిటీలకు అందుబాటులో ఉన్న కుప్పంలో పరిశ్రమ పెడితే మార్కెట్ తోపాటు రవాణా సౌకర్యాలకు ఇబ్బంది ఉండదన్న ఆలోచనతో హిందాల్కో వ్యూహాత్మకంగా కొత్త పరిశ్రమ స్థాపనకు కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకుంది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో అనుమతులు త్వరగా వస్తాయని భావనతో ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు చెబుతున్నారు.

అల్యూమినియం ఉత్పత్తులలో హిందాల్కో తన ప్రత్యేకత చాటుకుంది. యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్‌ల ఛాసిస్ (బాడీ) లను ప్రత్యేకంగా తయారు చేస్తుంది. ఆదిత్య బిర్లా గ్రూప్ కు చెందిన హిందాల్కో అల్యూమినియం, రాగి ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలో అగ్రగామి సంస్థల్లో ఒకటిగా చెబుతారు. 1958లో స్థాపించగా, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో విస్తరించింది. ఆటోమొబైల్స్, విమానాలు, ప్యాకేజింగ్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు హిందాల్కో ఉత్పత్తులపై ఆధారపడ్డాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.కుప్పంలో ఏర్పాటు కానున్న హిందాల్కో ప్రాజెక్ట్ కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాదని అంటున్నారు. "మేక్ ఇన్ ఇండియా" నినాదంతో రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసి "మేక్ ఫర్ ది వరల్డ్" లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా అల్యూమినియం పరిశ్రమలకు ముడిసరుకు అందిస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఐఫోన్ విడిభాగాలను ఇప్పుడు దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో తయారు చేయడం అనేది పారిశ్రామిక అభివృద్ధికి, సాంకేతిక పురోగతికి ఒక గొప్ప సంకేతంగా అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం జరగగానే పనులు ప్రారంభించి 2027 నాటికి ఉత్పత్తులు మార్కెట్ లోకి అందుబాటులోకి తీసుకురావాలని హిందాల్కో భావిస్తున్నట్లు చెబుతున్నారు.

# భారత్ పై ట్రంప్ సుంకాల వెనుక అసలు కారణం అదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో భారత ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధింపబడ్డాయి. ఈ చర్య ఒకే ప్రశ్నను రేకెత్తిస్తోంది. ఇది నిజంగా రష్యా చమురు కారణంగానా? లేక భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడా? అన్నది తేలాల్సి ఉంది. నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ సూటిగా చెప్పినట్లే, ఈ టారిఫ్‌లకు రష్యా చమురుతో సంబంధం లేదని స్పష్టమవుతోంది. రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారు చైనా. యూరప్ కూడా రష్యా ఇంధనంపై బాగా ఆధారపడి ఉంది. అయినా ఎందుకు భారత్‌పైనే కఠిన సుంకాలు? అమెరికా తన "మిత్రదేశం"పై ఇంత కఠినంగా వ్యవహరించడం సహజంగానే సందేహాలను రేకెత్తిస్తోంది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇప్పటికే స్పష్టంచేశారు. రష్యా నుంచి అత్యధిక దిగుమతులు భారత్ కాదని, చైనా, యూరప్ అని. అంతేకాదు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని అమెరికానే సూచించిందని ఆయన గుర్తుచేశారు. అయినా ఇప్పుడు అదే విషయాన్ని ఆయుధంలా ఉపయోగించి భారత్‌పై సుంకాల మోత మోగించడం తార్కికతను కోల్పోయిన నిర్ణయమే.

**భారత్‌కు మేల్కొలుపు**

ఈ పరిస్థితిని ఓ మేల్కొలుపుగా తీసుకోవాలని అమితాబ్‌కాంత్ పిలుపు గమనార్హం. నిజమే భారత్ తన ఇంధన భద్రత, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై రాజీపడలేదు. అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ వచ్చిన దేశం మనది. ఈసారి కూడా అదే ధైర్యంతో నిలబడాల్సిన అవసరం ఉంది.

**వాణిజ్యంపై ప్రభావం**

సుమారు 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై నేరుగా ప్రభావం చూపే ఈ సుంకాలు తాత్కాలికంగా మన ఆర్థిక వ్యవస్థకు భారమవుతాయి. వాణిజ్య రంగం ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల విధానం పరిగణనలోకి తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి. ఇది సమంజసమే. ఎందుకంటే, ఏకపక్ష చర్యలకు ఎదురు ప్రతిస్పందన అవసరం.

**ముందున్న సవాలు.. అవకాశం కూడా..**

ప్రపంచ వాణిజ్యంలో అమెరికా చూపుతున్న ద్వంద్వ వైఖరి భారత్‌ను కొత్త దారుల వైపు నడిపే అవకాశముంది. సుంకాల దెబ్బ మనకు ఇబ్బందే అయినా అదే సంస్కరణలకు, కొత్త వాణిజ్య భాగస్వామ్యాల అన్వేషణకు కారణమవ్వాలి. మొత్తం మీద ట్రంప్ టారిఫ్‌లు కేవలం రష్యా చమురు కారణం కాదని స్పష్టమవుతోంది. ఇవి భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడికి మరో రూపం. ఇలాంటి సందర్భాల్లో భారత్ వెనకడుగు వేయకుండా తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ ముందుకు సాగాల్సిందే.

# బుద్ధిపోనిచ్చుకోని చైనా.. పాక్ కు ఆహ్వానం.. మోడీకి లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజింగ్‌లో జరగనున్న చైనా 80వ విక్టరీ పరేడ్ చుట్టూ ఇప్పటికే రాజకీయ చర్చలు రగులుతున్నాయి. జపాన్‌పై సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ చైనా ప్రతీ ఏటా నిర్వహించే ఈ వేడుకలకు ఈసారి మరింత ఆర్భాటంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 3, 2025న జరిగే ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఝ్వయంగా ఆహ్వాన పత్రాలు పంపించారు.

**పాక్ ప్రధానికి ఆహ్వానం.. భారత్‌కు నిరాకరణ**

చైనా ఆహ్వానించిన 26 దేశాధినేతల జాబితాలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రత్యేకంగా ప్రస్తావన పొందారు. అంతేకాదు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తదితర నేతలు కూడా ఈ వేడుకలకు హాజరుకానున్నారు. అయితే ఆశ్చర్యకరంగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందలేదు. దీంతో ఈ ఘన వేడుకలో భారత్ ప్రాతినిధ్యం ఉండకపోవడం ఖాయమైంది.

**SCO సదస్సుకు మోదీ హాజరు**

ఇదే సమయంలో అదే వారం చైనాలో జరగనున్న షాంఘై సహకార సంస్థ ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే ఈ సమావేశం SCO చరిత్రలోనే అతిపెద్దదిగా ఉండనుందని చైనా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా 20 దేశాల నేతలు ఈ సదస్సులో హాజరవుతారు.

**భారత్ – చైనా సంబంధాల నేపథ్యం**

గత కొన్ని ఏళ్లుగా భారత్ – చైనా సంబంధాలు గట్టిగా పరీక్షకు గురవుతున్నాయి. 2018లో మోదీ చివరిసారి చైనాను సందర్శించారు. ఆ తర్వాత జిన్‌పింగ్ భారత్ పర్యటించారు. కానీ 2020లో లద్దాఖ్ గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ఇరు దేశాల సైనికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

**అమెరికా సుంకాలతో కొత్త మలుపు**

ఇక మరోవైపు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా నిర్ణయం కూడా చర్చనీయాంశమైంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని కారణంగా భారత్ వస్తువులపై 50 శాతం టారిఫ్ విధించారు. ఆగస్టు 27 నుంచి అమలులోకి వచ్చిన ఈ నిర్ణయం, భారత్ నుంచి అమెరికాకు జరిగే 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం చూపనుంది.

**రాబోయే రోజుల్లో అంతర్జాతీయ సమీకరణలు**

ఈ పరిణామాల నేపథ్యంలో చైనాలో జరగనున్న %బాజా% సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. అమెరికా వైఖరిపై పలు దేశాలు వ్యతిరేకంగా స్పందించే అవకాశముంది. చైనా%–%పాక్ సాన్నిహిత్యం, భారత్‌కు ఎదురవుతున్న ఆర్థిక%–%దౌత్యపరమైన సవాళ్లు రాబోయే కాలంలో అంతర్జాతీయ రాజకీయాలపై పెద్ద ప్రభావం చూపనివి కావు.

మొత్తం మీద చైనా విక్టరీ పరేడ్‌లో పాక్ ప్రధానికి ఆహ్వానం ఇవ్వడం, మోదీని పక్కన పెట్టడం వెనుక ఉన్న రాజకీయ సంకేతాలపై ప్రపంచ దృష్టి పడింది.

# రాహుల్ చేతిలో మరో బాంబు...పేల్చేది అపుడేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెలలో అతి పెద్ద రాజకీయ సంచలనానికి కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తెర తీశారు. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం మీద తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి ఆయన పెట్టిన పేరు ఓటు చోరీ. బీజేపీకి ఈసీ ఎన్నికల్లో సాయం చేస్తోంది అని ఆయన తన దగ్గర ఉన్న ఆధారాలను అన్నింటినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. దాంతో ఒక్కసారిగా దేశంలోనే కలకలం రేగింది. ఓట్ల చోరీ అంటూ రాహుల్ అందుకున్న నినాదం మీద మేధావులు ఇతర వర్గాలు చదువరులలో సైతం ఆలోచనలు రేకెత్తించాయి. సరి కొత్త చర్చలు అయితే అంతటా మొదలయ్యాయి.

**అదే ఊపుతో అలా**

ఇక చూస్తే కనుక ఆగస్ట్ 7న ఢిల్లీ వేదికగా మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఓట్ల చోరీ మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. పార్లమెంట్ ఒక వైపు జరుగుతూంటే ఎంపీలతో కలసి ఆయన ఈసీ కార్యాలయం దాకా ప్రదర్శన నిర్వహించారు అదే ఊపులో ఆయన బీహార్ రాష్ట్రమంతా ఓటర్ అధికార్ యాత్రను చేపట్టారు. దానికి జనంలో మంచి స్పందన లభిస్తోంది. ఆయన దాదాపుగా ప్రతీ రోజూ ప్రతీ సభలోనూ ఈసీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిపి ఎండగడుతున్నారు ఓట్ల చోరీ జరిగింది అన్నది అంతా నమ్ముతున్నారని కూడా అంటున్నారు

**మరో బాంబు రెడీనా**

ఇదిలా ఉంటే ఇదే స్పీడ్ లో రాహుల్ గాంధీ బీహార్ నుంచి ఒక సంచలన ప్రకటన చేశారు. ఓట్ల చోరీ పెద్ద ఎత్తున జరిగిందని నిరూపిస్తాను అని కూడా రాహుల్ గాంధీ గర్జిస్తున్నారు. ఒక్క బీహార్ లోనే ఏకంగా 65 లక్షల ఓటర్ల పేర్లు లేకుండా పోయాయని రాహుల్ ఆరోపించారు బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం కలసి ఈ విధంగా ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా ఓట్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువగా బాధితులుగా ఉన్నది బడుగు బలహీన వర్గాలవారేనని రాహుల్ అంటున్నారు.

**మరిన్ని ఆధారాలున్నాయి :**

ఓట్ల చోరీ జరిగింది అనడానికి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారు. రానున్న రోజులలో 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ ఏ విధంగా జరిగింది అన్నది కూడా వివరిస్తాను అని ఆయన చెప్పడం విశేషం. ఇప్పటిదాకా కర్ణాటక హర్యానా, మహారాష్ట్రలలో ఓట్ల చోరీ జరిగింది అని మాత్రమే చెబుతూ వచ్చిన రాహుల్ గాంధీ ఇపుడు దేశవ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సైతం ఓట్లు గల్లంతు అయ్యాయని వాటి పూర్తి సమాచారం తన దగ్గర ఉందని అంటున్నారు.

**మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ :**

ఇదిలా ఉంటే ప్రస్తుతం రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర పేరుతో బీహార్ లో యాత్ర నిరహిస్తున్నారు. అది ఈ నెల 17న ప్రారంభం అయింది. ఈ నెల చివరి దాకా కొనసాగుతుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే బహిరంగ సభతో ఈ యాత్ర ముగుస్తుంది ఆ తరువాత రాహుల్ గాంధీ లోక్ సభ ఎన్నికల్లో జరిగిన ఓట్ల చోరీ గురించి మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు అని అంటున్నారు. ఇప్పటికే ఓట్ల చోరీ ఆరోపణల మీద ఈసీ వివరణ ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం సరిపోవడం లేదు రాహుల్ గాంధీ జనంలోకి వెళ్తున్నారు వారి మధ్యనే అంతా చర్చకు పెడుతున్నారు. జనాల నుంచి వస్తున్న ఆదరణతో మరింత సమాచారం ఉందని అంటున్నారు రాహుల్ గాంధీ మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో ఎన్ని సంచలనాలు దేశ రాజకీయాల్లో నమోదు అవుతాయో అన్న చర్చకు తెర లేస్తోంది.

# వర్షం చెప్పిన అసలు కథ: రోడ్డెక్కిన కండోలిమ్‌లు.. ప్రజల్లో కలకలం!



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు పట్టణాల్లో రహదారులు చెరువుల్లా మారగా, గుంటూరులో మాత్రం వర్షం ఒక వింత దృశ్యాన్ని బయటపెట్టింది.

**అరండల్‌పేట రహదారులపై విచిత్ర దృశ్యం**

గుంటూరు నగరంలోని ఎప్పుడూ రద్దీగా ఉండే అరండల్‌పేట రోడ్డుపై వర్షపు నీటితో పాటు అనుకోకుండా పెద్ద సంఖ్యలో కండోలిమ్‌లు కొట్టుకువచ్చి పడటంతో స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రహదారులపై వాటిని చూసిన ప్రజలు తీవ్ర అసహనానికి గురై చీదరించారు. వినాయక చవితి సందర్భంగా మండపాలకు వచ్చే భక్తులు కూడా ఆ దృశ్యాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు.

**లాడ్జి నుంచి బయటకు వచ్చినవేనా?**

ఆ కండోలిమ్‌లు ఒక లాడ్జి ముందు రోడ్డు మీద కనిపించడంతో ఆ లాడ్జిలో అసలు ఏం జరుగుతుంది అన్న అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయి. వర్షం నీటితో అవి బయటకు కొట్టుకువచ్చి రహదారిపైకి చేరినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనితో ఆ లాడ్జి కార్యకలాపాలపై అనుమానాలు ముదురుతున్నాయి.

**ప్రజల ప్రశ్నలు – పోలీసుల మౌనం**

నగర నడిబొడ్డులో ఇలాంటి దృశ్యం కనబడుతుంటే పోలీసులు ఏమి చేస్తున్నారు

అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లాడ్జి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లపై కండోలిమ్‌లు కొట్టుకువచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**వర్షం చెప్పిన కథ**

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా రహదారులు మునిగిపోయాయి. కానీ ఈ వర్షం గుంటూరులోని ఒక లాడ్జి రహస్యాలను కూడా అందరికీ బహిర్గతం చేసింది. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని ఆ లాడ్జిపై విచారణ జరిపి,

# డేటింగ్ యాప్.. వీళ్లు మామూలు ముదుర్లు కాదండోయ్!

**హైదరాబాద్ పెన్ పవర్:** అప్డేట్ అవుతున్న జనరేషన్లో చాలామంది మహిళలు, పురుషులు డేటింగ్ యాప్ లను వాడుతున్నారు. ఈ డేటింగ్ యాప్ ద్వారా తమ అభిరుచులకు సెట్ అయిన పురుషుడిని గానీ మహిళను గానీ ఎంచుకొని కొన్ని రోజులు డేటింగ్ చేసి పెళ్లిళ్లు చేసుకోవడం చేస్తున్నారు. ఇక మరికొన్ని మ్యాట్రిమోనీ యాప్ లలో ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని పర్ఫెక్ట్ జోడి కోసం వెతుక్కుంటున్నారు. అయితే తాజాగా డేటింగ్ యాప్ లకు సంబంధించి ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే డేటింగ్ యాప్ లను మగవాళ్ళ కంటే ఎక్కువగా ఆడవారే యూస్ చేస్తున్నారట. అవును మీరు వినేది నిజమే.. తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ సిఈఓ ఈ విషయాన్ని బయటపెట్టారు. మరి ఇంతకీ ఆయన చెప్పిన విషయంలో ఉన్నది ఎంత నిజం అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

సాధారణంగా ఇంట్లో మహిళలకు కట్టుబాట్లు అనేవి ఉంటాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఏ టైంకి రావాలి.. ఎవరెవరితో ఉండాలి అనేది ఇంట్లో అమ్మా, నాన్న, అన్న, భర్త ఇలా ఎవరో ఒకరు కండిషన్ పెడుతూ ఉంటారు. కానీ ఇప్పటి జనరేషన్ చాలా మారిపోయింది. అమ్మాయిలు కూడా పురుషుల లాగే అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలా అబ్బాయిలతో సరి సమానంగా ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే అన్ని రంగాల్లో లాగే ఈ డేటింగ్ యాప్ లలో కూడా మగాళ్లకు మేము ఏమాత్రం తీసిపోము అంటున్నారు అమ్మాయిలు. ఎందుకంటే తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ వాళ్లు తమ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళ యూజర్ లే ఎక్కువగా ఉన్నారంటూ తేల్చేశారు.




తాజాగా Knot డేటింగ్ యాప్ సీఈఓ అయినటువంటి జస్వీర్ సింగ్ డేటింగ్ యాపుల్లో మహిళా యూజర్ లే ఎక్కువ ఉన్నారని, మగవాళ్ళు తక్కువగా ఉన్నారని తెలియజేశారు. జస్వీర్ సింగ్ మాట్లాడుతూ..Knot డేటింగ్ యాప్ లో 57% మహిళ సబ్స్క్రైబర్లు ఉన్నారు అంటూ తెలియజేశారు.ఇక 57% మహిళా సబ్స్క్రైబర్లు ఉంటే మిగిలిన 43% మంది పురుష యూజర్లు ఉన్నారన్నమాట. అలా వాళ్ళ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని ఆయన తెలియజేశారు. అంతే కాదు మా డేటింగ్ యాప్ లో ఆరు నెలల సబ్స్క్రిప్షన్ కోసం 57,459 రూపాయల ఫీజు పెట్టినా కూడా మహిళ యూజర్లు వెనకడుగు వేయడం లేదు. మగవాళ్ళ కంటే వీళ్లే ఎక్కువ డబ్బులు చెల్లించి సబ్స్క్రైబ్ చేసుకుంటున్నారు అంటూ సంచలన విషయం బయటపెట్టారు. ప్రస్తుతం Knot డేటింగ్ యాప్ సీఈవో చెప్పిన ఈ విషయం విన్న చాలామంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు కలికాలం అంటూ మరి కొంతమంది మగవాళ్లు కామెంట్స్ పెడుతున్నారు. ఇక అమ్మాయిలేమో మగవాళ్ళ కంటే అమ్మాయిలు ఏ విషయంలో కూడా తీసిపోరు అని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఆన్లైన్లో టిండర్,బంబుల్, గ్రిండర్, Knot వంటి ప్రముఖ డేటింగ్ యాప్ లు ఉన్నాయి. డేటింగ్ యాప్ ల వల్ల చాలామంది అభిప్రాయాలు కలిసి పెళ్లిళ్లు చేసుకున్న వారు ఉన్నారు. మరి కొంతమంది పెళ్లిళ్లు కాకుండా డేటింగ్ లు చేసి నచ్చకపోతే బ్రేకప్ చెప్పుకున్న వాళ్ళు కూడా ఉన్నారు.

## పవర్ హిట్టర్స్, యార్కర్ల వీరులకు పండగే.. ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్ రెండు కొత్త రూల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఇటీవలే చాలా కొత్త రూల్స్ ప్రకటించింది. టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్, లాలాజల నియమంలో మార్పు, DRS విధానంలో కొత్త మార్పు, షార్ట్ రన్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రికెట్ ను మరింత ఆసక్తికరంగా మార్చడానికి ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్.. మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ క్రికెట్ లో రెండు సరికొత్త రూల్స్ ను ప్రతిపాదించాడు. పవర్ ఫుల్ హిట్టర్లకు ఈ రూల్ ఊరించేలా చేస్తుంది. మరోవైపు యార్కర్లు వేసే బౌలర్లకు ఈ రూల్ అనుకూలంగా ఉంది.

### 100 మీటర్లు కొడితే 12 పరుగులు:

పీటర్సన్ మాట్లాడుతూ.. " నేను ఇంతకు ముందే చెప్పాను. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను. ఒక బ్యాటర్ కొట్టిన సిక్సర్ 100 మీటర్లు దాటితే జట్టుకు ఆరు పరుగులు కాకుండా 12 పరుగులు ఇవ్వాలి. ఈ రూల్ పెడితే బ్యాటర్లు భారీ సిక్సర్లు కొట్టడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు క్రికెట్ ఫ్యాన్స్ కు ఎక్కువ ఎంటర్ టైన్ లభిస్తుంది". అని ఈ ఇంగ్లాండ్ క్రికెటర్ అన్నాడు. క్రికెట్ లో 100 మీటర్ల సిక్సర్లు చాలా అరుదుగా కొడుతూ ఉంటారు. పీటర్సన్ రూల్ పై భిన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. క్రికెట్ లో బేసిక్ రూల్స్ ను మార్చడమేంటి అంటూ కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు.

### మిడిల్ స్టంప్ కు బాల్ తగిలితే నెక్ట్స్ బ్యాటర్ ఔట్:

"ఒక బౌలర్ మిడిల్ స్టంప్‌ను పడగొట్టి వికెట్ తీస్తే నెక్ట్స్ వచ్చే బ్యాటర్ కూడా ఔట్ గా ప్రకటించాలి. దీని వలన బౌలర్లు ఎక్కువగా యార్కర్లు వేయడంపై దృష్టి పెడతారు". అని అన్నాడు. పీటర్సన్ చెప్పిన దాన్ని బట్టి చూస్తే బౌలర్ మిడిల్ స్టంపు ను పడగొడితే రెండు వికెట్లు తీసినట్టే. ఈ రూల్ పాయ్ కూడా నెటిజన్స్ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. టెస్టు క్రికెట్ లో అద్భుతమైన బ్యాటర్ గా పేరు తెచ్చుకున్న పీటర్సన్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో మెంటార్ గా ఉన్నాడు.

## లాకీ ఫెర్గ్యూసన్ ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్లు వీరే..

# టీమిండియా పేసర్లకు నో ఛాన్స్







**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఎంతో మంది ఫాస్ట్ బౌలర్లు తమదైన ముద్ర వేశారు. కొంతమంది స్వింగ్ తో బోల్తా కొట్టిస్తే మరి కొంతమంది తమ వేగంతో బయపెట్టేవారు.
మరికొందరైతే బౌన్సర్లతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవారు. వీరందరికి డిఫరెంట్ గా యార్కర్లతో ఇబ్బంది పెట్టే పేసర్లు ఉన్నారు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గ్యూసన్ తన ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్ల వ్యక్తిగత లిస్ట్ ను షేర్ చేశాడు. వీరిలో ఒక్కరు కూడా ఇండియన్ పేసర్ లేదు. క్రిక్‌ట్రాకర్‌కు ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో పాకిస్తాన్ నుండి ఇద్దరు దిగ్గజాలుకు చోటివ్వగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లలో ఒకొక్కరికి ఛాన్స్ ఇచ్చాడు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**షేన్ బాండ్ (న్యూజిలాండ్): ఖ**
కెరీర్ ప్రారంభంలో ఫ్యూచర్ స్టార్ బౌలర్ గా కితాబులు అందుకున్న షేన్ బాండ్ కెరీర్ గాయాల కారణంగా స్వల్ప కాలానికే పరిమితమైంది. టెస్ట్ కెరీర్‌లో కేవలం 18 మ్యాచ్‌ల్లో 87 వికెట్లతో తన సుదీర్ఘ ఫార్మాట్ కెరీర్ ను ముగించాడు. యావరేజ్ 22.09 కాగా స్ట్రైక్ రేట్ 38.76 ఉంది. షేన్ బాండ్ స్ట్రైక్ రేట్ (కనీసం 2,500 బంతులు) లో ఆల్-టైమ్ బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో ఉండడం విశేషం. బాండ్ ఫిట్ గా ఉన్న సమయంలో తన వేగంతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవాడు.

**మిచెల్ జాన్సన్ (ఆస్ట్రేలియా):**
ఆస్ట్రేలియాకు లెఫ్టర్మ్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ జాన్సన్ ఈ లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్నాడు. 2010 దశాబ్దంలో జాన్సన్ టాప్ బౌలర్. అతని బౌన్సర్లతో బ్యాటర్లను ఇబ్బందిపెట్టేవాడు. ఓవరాల్ గా జాన్సన్ తన టెస్ట్ కెరీర్ లో 28.40 సగటుతో 313 టెస్ట్ వికెట్లను పడగొట్టాడు. వీటిలో 12 సార్లు ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 2013-14 యాషెస్ సిరీస్‌లో విశ్వరూపమే చూపించాడు. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 37 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు.

**షోయబ్ అక్తర్ (పాకిస్తాన్):**
'రావల్పిండి ఎక్స్‌ప్రెస్' అని పిలువబడే షోయబ్ అక్తర్ ను ఫెర్గ్యూసన్ తన టెస్ట్ బెస్ట్ బౌలర్ల జాబితాలో చోటిచ్చాడు. ఎక్స్‌ప్రెస్ వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టిన అక్తర్ బౌలింగ్ ఆడడం అప్పట్లో ఒక ఛాలెంజ్. క్రికెట్ చరిత్రలో 161.3 కి.మీ/గం వేగంతో వేగవంతమైన డెలివరీ రికార్డు సైతం ఈ పాక్ బౌలర్ పేరిట ఉండడం విశేషం. ఓవరాల్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే 46 టెస్టులలో 25.69 సగటుతో 178 వికెట్లు పడగొట్టాడు.

**వసీం అక్రమ్ (పాకిస్తాన్):**
ఫెర్గుసన్ జాబితాలో చేరిన మరో బెస్ట్ బౌలర్ పాకిస్తాన్ పేసర్ వసీం అక్రమ్. క్రికెట్ చరిత్రలో గ్రేటెస్ట్ లెఫ్ట్ హ్యాండర్ బౌలర్ గా అక్రమ్ కు పేరుంది. ఓ వైపు వేగంగా బంతులు వేస్తూనే బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలడు. బాల్ ను రివర్స్ స్వింగ్ చేయడంలో తనకు తానే సాటి. 90 వ దశకంలో అక్రమ్ బౌలింగ్ ను ఎదుర్కోవడం బ్యాటర్లకు ఒక పీడకల. తన టెస్ట్ కెరీర్ లో ఓవరాల్ గా 104 మ్యాచ్‌ల్లో 23.62 సగటుతో 414 వికెట్లను అక్రమ్ తన ఖాతాలో వేసుకున్నాడు. వీటిలో 25 ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 'సుల్తాన్ ఆఫ్ స్వింగ్' గా పేరు తెచ్చుకున్న అక్రమ్ వన్డేల్లో 500 వికెట్లను పడగొట్టిన ఏకైక బౌలర్.

**కర్ట్లీ ఆంబ్రోస్ (వెస్టిండీస్):**
వెస్ట్ ఇండియన్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కర్ట్లీ ఆంబ్రోస్ కు ఫెర్గ్యూసన్ తన లిస్ట్ లో చోటు కల్పించాడు. ఆరడుగుల ఆంబ్రోస్ బౌన్సర్లను ఎదర్కోవడం 1980ల్లో బ్యాటర్లకు అతి పెద్ద పరీక్షగా మారింది. 1990 దశాబ్దంలో కూడా ప్రపంచ క్రికెట్ లో తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. అంబ్రోస్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే ఓవరాల్ గా 98 మ్యాచ్‌ల్లో 20.99 సగటుతో 405 టెస్ట్ వికెట్లు పడగొట్టాడు. వీటిలో 22 సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. 1993లో ఆస్ట్రేలియాపై 1 పరుగుకు 7 వికెట్లు తీసి మైండ్ బ్లోయింగ్ స్పెల్ వేశాడు.


# నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. నటి ఫికర్!



నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. కొన్ని ఫోటోలను తీసి ఉద్దేశపూర్వకంగా వాటిని జూమ్ చేయడం ద్వారా సంచలనాలను సృష్టించాలని అనుకుంటారు%--% అని అన్నారు కృతి సనోన్. తాను పొట్టి దుస్తుల్లో ఉన్నప్పుడు ఫోటోగ్రాపర్లు తనను రకరకాల కోణాల్లో ఫోటోలు తీసేందుకు ఆరాటపడతారని, కానీ తాను వేదికలపైకి వెళ్లినప్పుడు తన సహచరులను తనకు ముందుగా నిలబడాలని రెక్వెస్ట్ చేస్తానని కూడా కృతి చెప్పింది. వారు చూసే కోణం తప్పుడు కోణం.. ఉద్దేశపూర్వకంగా అలాంటి ఫోటోలు తీస్తారు! అని కూడా కృతి అన్నారు. సినీరంగంలో ఎదగాలనుకున్న నటీమణులకు ఇలాంటి వ్యక్తుల వల్ల సమస్యలు తలెత్తుతాయని కూడా తెలిపారు. అయితే సెలబ్రిటీల గోప్యతను కాపాడే విషయంలో హాలీవుడ్ మీడియా పద్ధతిగా ఉంటుందని కూడా కృతి కితాబిచ్చింది. ఓసారి ప్రియాంక చోప్రా గౌన్ వేదికపైనే జారిపోతుండగా, ఆ సమయంలో తన గౌరవాన్ని కాపాడుతూ అంతర్జాతీయ మీడియా దానిని షూట్ చేయలేదని చెప్పింది. కానీ భారతీయ మీడియా అలా కాదు. శరీర అందాలను హైలైట్ చేయాలని తహతహలాడుతుంది. వీటిని మీడియాలు స్పెషల్ స్టోరీలుగా వేస్తారు. అయినా మీడియా, సెలబ్రిటీల మధ్య పరస్పర గౌరవం ఉండాలి! అని కృతి పేర్కొంది. అసలు మీడియాలు మహిళలను ఎలా చూస్తాయో చెప్పాలని కూడా కృతి ఈ సందర్భంగా కోరారు. ఇది త్రోబ్యాక్ వీడియో అయినా జోరుగా వైరల్ అవుతోంది.మహిళల రక్షణ, గోప్యత, గౌరవం గురించి కృతి మాట్లాడిన విషయాలు అందరికీ నచ్చాయి. కృతి సనోన్ తో పాటు ఇటీవలి కాలంలో పలువురు యువనటీమణులు ఇండస్ట్రీలో సమస్యలపై బహిరంగంగా చర్చిస్తూ చర్చల్లోకొస్తున్నారు. కాక్ టైల్ 2, తేరే ఇష్క్ మే అనే రెండు భారీ చిత్రాల్లో కృతి సనోన్ నటిస్తోంది.



వైబ్రెంట్ ఆరెంజ్ డ్రెస్‌లో కంగనా శర్మ స్టన్స్



చిక్ క్యాజువల్ గ్లామ్‌లో నటాషా సింగ్ స్టన్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com